విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :120 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 17 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం

- మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందే'
- కేంద్రం కీలక ప్రకటన!
- మెటాను ఇక సాధారణ ఇంటర్మీడియరీగా చూడలేమన్న ప్రభుత్వ వర్గాలు
- లీగల్ ఇమ్యూనిటీపై తుది నిర్ణయం న్యాయస్థానాలదేనని వ్యాఖ్యలు



## గత ప్రభుత్వంలో పెట్టిన దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం

- భారతి రెడ్డిపై పోస్ట్ పెడితే మా కార్యకర్తనే జైలుకు పంపా
- మహిళల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడాన్ని సహించబోమన్న లోకేశ్
- భారతి రెడ్డిపై పోస్ట్ పెట్టిన టీడీపీ కార్యకర్తను జైలుకు పంపించానని వెల్లడి
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు సవాల్ విసిరిన లోకేశ్
- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్

**అమరావతి**

రాజకీయాల్లో మహిళల వ్యక్తిగత ప్రతిష్ఠను కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, ఆ బాధ ఎలా ఉంటుందో తాను ప్రత్యక్షంగా చూశానని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఒక మహిళగా తన తల్లి భువనేశ్వరి అసెంబ్లీలో అవమానానికి గురైనప్పుడు ఎంతటి వేదన అనుభవించారో తనకు తెలుసని, అలాంటి పరిస్థితి మరే మహిళకూ రాకూడదనేదే తన లక్ష్యమని అన్నారు. వైఎస్ భారతి రెడ్డి గురించి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టినందుకు సొంత పార్టీ కార్యకర్తనే జైలుకు పంపించానని లోకేశ్ వెల్లడించారు. రాజకీయాలు, కుటుంబాలు వేరని, తమ పార్టీ మహిళల జోలికి - మిగతా3లో

# లక్ష్యాలు చేరకపోతే సమావేశాలెందుకు?



- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు
- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం

**అమరావతి**

రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశా నిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో - మిగతా3లో




## లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

- 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026'ను విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్
- 131వ స్థానంలో నిలిచిన భారత్
- వరుసగా 16వసారి తొలి ర్యాంకు దక్కించుకున్న ఐస్‌లాండ్

## భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు

- ఔలీ కొండల్లో డ్రోన్లు, ఆధునిక ఆయుధాలతో డ్రిల్స్
- ఉత్తరాఖండ్‌లో 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు
- డ్రిల్స్‌లో పాల్గొన్న 600 మంది సైనిక సిబ్బంది
- రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన




## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు

- ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?: జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" - మిగతా3లో




## మక్కాపై డ్రోన్ దాడి యత్నం.. స్పందించిన భారత్

- మక్కా సమీపంలో డ్రోన్ దాడి యత్నంపై భారత్ ఆందోళన
- దాడిని విజయవంతంగా తిప్పికొట్టిన సౌదీ అరేబియా
- ఇది ఉగ్రచర్యేనని, రెచ్చగొట్టే ప్రయత్నమని సౌదీ ప్రకటన
- సౌదీ సార్వభౌమాధికారంపై దాడులను ఖండించిన భారత్

## ఏపీలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం

- ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల
- ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివద్ధి చేయడమే లక్ష్యం



**తిరుమల**

రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణమే లక్ష్యమని సీఎం చంద్రబాబు వెల్లడించారు. బుధవారం తిరుమలలో పలు అభివద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్--1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 - మిగతా3లో

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

- భారతీయ సినిమాకు చేసిన సేవలకుగాను ఈ పురస్కారం..
- సెప్టెంబర్ 22న గుజరాత్‌లో అవార్డు ప్రదానం
- అనంత్ నాగ్‌ను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 300కి పైగా చిత్రాలు, 'మాల్గుడి డేస్'తో దేశవ్యాప్త గుర్తింపు



# గత ప్రభుత్వంలో పెట్టిన దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం

-మొదటిపేజీ తరువాయి

వస్తే మాత్రం దబిడి దిబిడేనని ప్రత్యర్థి పార్టీ నేతలను గట్టిగా హెచ్చరించారు. బుధవారం నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్, 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వంపై, వైసీపీ అధినేత నేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకడు బుల్లెట్ దిగిందా అంటాడు. గెలవకపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్నాడు, ఏమైంది ఆ సన్యాసం? చంద్రబాబు జోలికి ఎవరు వచ్చినా మాడి మసైపోతారు. దేవుడు ఎవర్నీ వదిలిపెట్టడు," అంటూ పరోక్షంగా స్థానిక నేతలపై విమర్శలు గుప్పించారు.

**జగన్‌కు డీఎస్సీపై చర్చకు సవాల్**

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం డ్రామా కంపెనీ నడిపిందని లోకేశ్ ధ్వజమెత్తారు. "కోడికత్తి, గులకరాయి వంటి డ్రామాలను ప్రజలెవరూ మర్చిపోలేదు. ఒక ముఖ్యమంత్రికి డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించింది. బహుశా వాళ్ల దృష్టిలో డీఎస్సీ అంటే డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ కావచ్చు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయని వాళ్లు, మేము అధికారంలోకి రాగానే 16,000 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తే విమర్శిస్తున్నారు. దమ్ముంటే డీఎస్సీపై చర్చకు రా.. టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్," అంటూ జగన్‌కు సవాల్ విసిరారు. సొంత బాబాయి హత్య కేసులో ఇప్పుడు ఈడీ విచారణ ఎదుర్కొంటున్నారని, నాడు 'నారాసుర రక్త చరిత్ర' అంటూ తమపై బురద చల్లారని మండిపడ్డారు.

**మాజీ మంత్రుల అవినీతిని ఎండగట్టిన లోకేశ్**

గత ప్రభుత్వంలోని మంత్రులు అవినీతిలో కూరుకుపోయారని లోకేశ్ ఆరోపించారు. మాజీ మంత్రి శిదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి ఒక యాదవుడిని చంపి పారిపోతే, ఆ కేసులో మరొకరిని ఇరికించాలని చూశారని విమర్శించారు. అలాంటి వ్యక్తిని జగన్ పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మరో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం కుంభకోణంలో రూ.400 కోట్లు



సంపాదించి, ఆ డబ్బును కోడలి ఖాతాలో వేశారని, ఇప్పుడు ఆమెను కేసులో ఇరికించారని ఆరోపించారు. బీసీ నేతలైన అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్యలను వైసీపీ నేతలే పొట్టనపెట్టుకున్నారని, ఇప్పుడు కులం ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

**దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం: కార్యకర్తలకు భరోసా**

2019 నుంచి 2024 మధ్య టీడీపీ కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన దొంగ కేసులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన ఎత్తివేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఇందుకోసం ఎంపీ బైరెడ్డి శబరి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కేసులు ఉన్న కార్యకర్తలు వెంటనే పార్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మీరు ఇంట్లో పడుకుంటే, మీ కేసుల సంగతి మాకు ఎలా తెలుస్తుంది? మీపై ఉన్న కేసుల వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి అని స్పష్టం చేశారు.

అదేవిధంగా, 2014-19 మధ్య టీడీపీ హయాంలో చేసిన పనులకు సంబంధించి ఆగిపోయిన బిల్లులను కూడా 99 శాతం క్లియర్ చేశామని, మిగిలినవి ఉంటే తెలియజేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాకుండా ఇప్పుడే ఈ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. కోవూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని లోకేశ్ అన్నారు. నియోజకవర్గంలో ఎనిమిది సార్లు గెలిచినా అన్నగారి విగ్రహం లేని లోటును వేమిరెడ్డి దంపతులు తీర్చారని అభినందించారు. కార్యకర్తే పార్టీకి అధినేత అని, వారి త్యాగాల వల్లే పార్టీ నిలబడి ఉందని కొనియాడారు. 'మై టీడీపీ' యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు లైఫ్ వచ్చేనా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అధిష్ఠానం ఇన్‌ఛార్జ్ ల మార్పు ప్రక్రియను పూర్తి చేసింది. శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ, మాణిక్యం ఠాగూర్ స్థానంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత పీసీ మోహన్‌ను ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. అయితే, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిన విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పునాదులు కదిలిపోయిన చోట కేవలం పర్యవేక్షకులను, ఇన్‌ఛార్జ్‌లను మార్చడం వల్ల పార్టీకి కొత్త ఊపిరి వస్తుందా అంటే.. ప్రయోజనం శూన్యమనే సమాధానమే వస్తోంది. ఏపీ విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోర్ ఓట్ బ్యాంక్ ఉండేది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలు , దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు కాంగ్రెస్‌కు వెన్నెముకగా నిలిచారు. కానీ, విభజన పర్యవసానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. ఆ సాంప్రదాయ ఓటు బ్యాంక్ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలోకి మళ్లించుకుంది. గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీకి అదే ప్రధానమైన బలంగా మారింది. కాంగ్రెస్ పునర్వైభవం సాధించాలంటే ఆ కోల్పోయిన పునాదిని మళ్లీ దక్కించుకోవడం ఒక్కటే మార్గం, కానీ ఆ దిశగా పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్ ప్రయత్నాలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి స్పష్టమైన క్షేత్రస్థాయి వ్యూహం లేకపోవడమే అతిపెద్ద బలహీనత. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు లేదా అసెంబ్లీ వేళల్లో ప్రెస్ మీట్లు పెట్టడం, సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడానికే రాష్ట్ర నాయకత్వం పరిమితమవుతోంది. వైఎస్ షర్మిలకు ఏపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తర్వాత కొంతవరకు మీడియా మైలేజ్, క్యాడర్‌లో కొంత చలనం వచ్చినా.. అది ఓట్ల రూపంలోకి లేదా వైఎస్సార్‌సీపీ కోర్ ఓటు బ్యాంకును ఆకర్షించే స్థాయిలోకి మారలేదు. అసలైన జనాకర్షక నేతలు, క్షేత్రస్థాయిలో బలం ఉన్న స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ విస్తరణ ఆగిపోయింది.



దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓటు బ్యాంకు స్వరూపం ఒకటే. కానీ ఏపీలో వైఎస్ఆర్‌సీపీని విమర్శించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి అనుకూలంగా ఉందనే భావన సాధారణ ప్రజల్లోకి వెళ్తోంది. ప్రత్యేకించి బీజేపీతో టీడీపీ పొత్తులో ఉన్న తరుణంలో, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌కు మంచి అవకాశం ఉన్నప్పటికీ, కూటమి వైఫల్యాలపై ధ్వజమెత్తడంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉండటం లేదనే విమర్శ ఉంది. ఈ వ్యూహాత్మక అయోమయం వల్ల మైనారిటీ, దళిత వర్గాలు కాంగ్రెస్ వైపు చూడటానికి వెనుకాడుతున్నాయి.కర్ణాటకకు చెందిన పీసీ మోహన్ నాయకత్వంలోనైనా ఏపీ కాంగ్రెస్ రూట్ మ్యాప్ మారుతుందా అన్నది ఇప్పుడు సవాలు. కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయం, అక్కడ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల మోడల్‌ను ఏపీ ప్రజల్లోకి తీసుకెళ్లడం మోహన్‌కు కొంతవరకు కలిసివచ్చే అంశం. అయితే, కేవలం విజయవాడ లేదా అమరావతిలోని పార్టీ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి ఫలితం ఉండదు. బూత్ స్థాయి నుంచి కమిటీలను పునర్నిర్మించడం, కూటమి ప్రభుత్వం , ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ రెండింటికీ సమదూరం పాటిస్తూ సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం తక్షణ అవసరం. రూట్ లెవల్‌లో నాయకత్వాన్ని తయారు చేయకుండా, డివైడ్ అయిన సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకట్టుకునేలా స్పష్టమైన ఆర్థిక-సామాజిక విధాన ప్రకటనలు చేయకుండా.. ఇన్‌ఛార్జ్‌లను ఎంతమందిని మార్చినా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతుంది. కొత్తగా వచ్చిన పీసీ మోహన్ అయినా కేవలం ఢిల్లీ మార్గదర్శకాలను అమలు చేసే ప్రతినిధిగా మిగలకుండా, ఏపీ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# అనిల్‌కు దౌరమౌతున్న నెల్లూరు

**నెల్లూరు :** నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అడుగులు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా అనిల్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టిని ఆకర్షించేందుకు, అధికార కూటమి నేతలతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, అనిల్ పడుతున్న ఈ ఆరాటం క్షేత్రస్థాయిలో ఆయనకు రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందా అంటే.. సాధ్యం కాదనే సమాధానమే సొంత పార్టీ వర్గాల నుంచే వస్తోంది.జగన్ మోహన్ రెడ్డి నైజం తెలిసిన ఎవరికైనా అనిల్ ఆశలు నెరవేరడం అంత సులువు కాదని అర్థమైపోతుంది. ప్రస్తుతం నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. జగన్‌కు అత్యంత విశ్వసనీయుడిగా, ఆర్థికంగా , సామాజికంగా బలంగా ఉన్న చంద్రశేఖర్ రెడ్డిని పక్కనపెట్టి, గత ఎన్నికల్లో నరసరావుపేటకు వెళ్లి ఓటమిపాలై మళ్లీ నెల్లూరుకు వచ్చిన అనిల్ చేతికి సిటీ బాధ్యతలు అప్పగించే సాహసం జగన్ చేయకపోవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీ అధిష్టానం ఆలోచన శైలి ప్రకారం.. ఒకసారి నియోజకవర్గం మారిన తర్వాత లేదా ఓటమిపాలయ్యాక మళ్లీ పాత స్థానానికి పూర్తి స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వడం దాదాపు అసాధ్యం.మరోవైపు నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీలోని ప్రధాన రెడ్డి సామాజికవర్గ నేతలెవరూ అనిల్ కుమార్ యాదవ్‌ను మళ్లీ జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పనిచ్చేందుకు సిద్ధంగా లేరు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రదర్శించిన ఏకపక్ష వైఖరి, సొంత పార్టీ నేతలతోనే విభేదించిన తీరు ఇంకా వారి మనసుల్లో మెదులుతూనే ఉంది. బిసి కార్డును వాడుకుని మళ్లీ తమ సామాజికవర్గానికి దక్కాల్సిన రాజకీయ అవకాశాలు, పట్టును అనిల్ కొట్టేస్తారనే భయం వారిలో బలంగా ఉంది. అందుకే జిల్లాలోని రెడ్డి సామాజికవర్గ సీనియర్లు అంతా అంతర్గతంగా అనిల్‌కు వ్యతిరేకంగా ఏకమవుతూ, ఆయనకు సిటీ బాధ్యతలు రాకుండా అధిష్ఠానం వద్ద గట్టిగానే అడ్డుకట్ట వేస్తున్నట్లు సమాచారం.స్థానిక ఎన్నికల హడావుడిని అడ్డం పెట్టుకుని, వేమిరెడ్డి దంపతులపై అనవసరమైన ఆరోపణలు, హడావుడి వ్యాఖ్యలు చేయడం ద్వారా తానే జిల్లాలో వైసీపీ తరఫున ఏకైక పోరాట యోధుడినని ప్రాజెక్ట్ చేసుకోవడానికి అనిల్ ప్రయత్నిస్తున్నారు. అయితే, గతంలో వైసీపీలోనే ఉండి పార్టీకి కొండంత అండగా నిలిచిన వేమిరెడ్డిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అనిల్‌కు పార్టీ శ్రేణుల నుంచి కూడా పెద్దగా మద్దతు లభించడం లేదు. పైగా ఈ రకమైన అతి దూకుడు వల్ల స్థానికంగా ప్రశాంతంగా ఉన్న కేడర్‌లో కూడా అనవసర ఉద్రిక్తతలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అనిల్ కుమార్ యాదవ్ ఎంతగా హడావుడి చేసినా, జగన్‌ను మెప్పించేందుకు ఎంతటి తీవ్ర వ్యాఖ్యలు చేసినా, రాబోయే రోజుల్లో ఆయనకు నెల్లూరు సిటీ టికెట్ లేదా ఇన్ ఛార్జ్ పదవి దక్కే అవకాశాలు దాదాపు శూన్యమనే ప్రచారం నెల్లూరు రాజకీయాల్లో గట్టిగా సాగుతోంది. స్వపక్షంలోనే సీనియర్ల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకత, అధిష్టానంలో చంద్రశేఖర్ రెడ్డికి ఉన్న ప్రాధాన్యత, జగన్ రాజకీయ వ్యూహాల దృష్ట్యా అనిల్ నెల్లూరు రీ-ఎంట్రీ ఒక కలగానే మిగిలిపోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ఏపీలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం

-మొదటిపేజీ తరువాయి

శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ--మొబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతో పాటు టీటీడీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

-మొదటిపేజీ తరువాయి

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు..

-మొదటిపేజీ తరువాయి

అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. "చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

**తిరుపతి :** జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు.

# రాంకీ సిఎస్ఆర్ సేవలు అభినంద నీయం.






ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.

**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** గ్రామం లో రామ్ కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సహకారంతో రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 11.5 లక్షల వ్యయంతో నిర్మించిన చేపల మార్కెట్ ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మండల ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామ్ కీ ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా చేపడుతున్న సిఎస్ఆర్ కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. రామ్ కీ ఫౌండేషన్ నిర్మించిన చేపల మార్కెట్ లో సుమారు 20 మంది చేపల వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ సదుపాయాన్ని సక్రమంగా వినియోగించు కోవడంతో పాటు మార్కెట్ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. రామ్ కీ ఫౌండేషన్ తన సేవలను మరింత విస్తరించి, ప్రజలకు మరిన్ని సామాజిక సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, మండల అభివృద్ధి అధికారి ఏ. మల్లికార్జున రావు, రామ్ కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డా" కే. శ్రీకాంత్, డీజీఎం గిరిధర్ రావు బక్షి, రామ్ కీ ఫౌండేషన్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ధర్మవరం కొత్తపేటలో ఘనంగా సిద్ధి వినాయక విగ్రహం ఏర్పాటు






**ధర్మవరం,సెప్టెంబర్ 16 (పెన్ సత్తా )**శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ సిద్ధి వినాయక విగ్రహాన్ని ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దర్శించుకున్నారు.
ఆయనతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్,చేనేత నాయకుడు సందా రాఘవ తదితరులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ రాజ్ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

- సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్
- సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో భారీ వినాయక విగ్రహం ఏర్పాటు
- పరిటాల శ్రీరామ్‌తో కలిసి వినాయకుడిని దర్శించుకున్న పరిసే సుధాకర్,సందా రాఘవ
- రాజ్ న్యూస్‌తో మాట్లాడిన ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

# హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు తిక్కస్వామి నగర్‌లో మున్సిపల్ స్థల పరిశీలన చేసిన

మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం,సెప్టెంబర్ 16 (పెన్ సత్తా )**పట్టణంలో హిందూ స్మశాన వాటికకు స్థల కొరత కారణంగా ప్రజలు శవసంస్కారాల సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ,వైద్య విద్య శాఖ మంత్రి ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామి నగర్ వద్ద ధర్మవరం మున్సిపల్ ఐడీఎస్ఎంటీ పరిధిలో ఉన్న స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యతో కలిసి మంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలించారు. హిందూ స్మశాన వాటికకు తగిన స్థలం లేకపోవడంతో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, గతంలో మలినేనిపల్లి ప్రాంతంలోని డంప్‌యార్డ్ వద్ద స్మశాన వాటిక ఏర్పాటుకు స్థల పరిశీలన చేపట్టారు. అయితే పట్టణ ప్రజల రాకపోకలకు దూరంగా ఉండటం, ప్రజలకు అవసరమైన అందుబాటు మరియు సౌకర్యాల పరంగా అనుకూలంగా ఉండకపోవచ్చనే అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలోనే పట్టణ ప్రజలకు మరింత అందుబాటులో ఉండే ప్రాంతంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు అవకాశం ఉన్న స్థలంగా తిక్కస్వామి నగర్ వద్ద ఉన్న మున్సిపల్ ఐడీఎస్ఎంటీ స్థలాన్ని మంత్రి పరిశీలించారు. స్థల విస్తీర్ణం, రాకపోకలకు అనుకూలత, భవిష్యత్ అవసరాలు,స్మశాన వాటిక ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఉన్న అవకాశాలను మంత్రి పరిశీలించారు.స్థల పరిశీలన అనంతరం హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను సమగ్రంగా సిద్ధం చేసి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) వారికి పంపించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని, అవసరమైన అనుమతులు తదుపరి చర్యలను వేగవంతం చేసి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.పట్టణ ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక సదుపాయాల్లో భాగంగా హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణంలో శవసంస్కారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ స్థల పరిశీలన చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. గతంలో పరిశీలించిన స్థలంలోని ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని,ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ కుమారుని జన్మదిన వేడుకలు



**ధర్మవరం,సెప్టెంబర్ 16 (పెన్ సత్తా )** ధర్మవరం మాజీ శాసనసభ్యులు గోనుగుంట్ల సూర్యనారాయణ కుమారుడు యువ నాయకుడు గోనుగుంట్ల నితిన్ సాయి పుట్టిన రోజు సందర్భంగా ప్రియాంక నగర్ లోని సూరి వ్యక్తిగత కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి ధర్మవరం అభివృద్ధికి చేసిన కార్యక్రమాలను వారు వివరించారు.త్వరలో రాజకీయాల్లో తిరిగి రావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మహిళలు పద్మావతమ్మ,సుజాతమ్మ,ప్రభావతి,అరుణ, ఏలుకుంట్ల అప్పస్వామి, పెద్దాయప్ప,చెన్నారెడ్డి, బిల్వంపల్లి నారాయణ స్వామి, రామకృష్ణ,బొడిగల గిరి,నారాయణ స్వామి యాదవ్,చిలకం సూర్యనారాయణ రెడ్డి,రాప్తాటిరాము, గోపాలకృష్ణ,కట్టుబడి వీరన్న,దర్శినమల నాగరాజు, మలకాపురం హరి,బాల,బాబయ్య,సూరి,పోతుకుంట మధు,రామకృష్ణ, సూరి,శ్రీనివాసులు, మల్లేనిపల్లి రాజు,సుబ్బరావు పేట గంగాధర్,షెక్షావలి, తిప్పేపల్లి శ్రీరాములు,జయశంకర్,రాజారెడ్డి,ఇమాం సాబ్,అంజినాయక్, గొడ్డుమర్రి క్రిష్ట, నారాయణ, రామాంజి, వన్నూరప్ప,ఓబులనాయుని పల్లి రామకృష్ణ, క్రిష్ణంరాజు,నగేష్, లచ్చేనాయక్,ధర్మపురి రాజు,గంధమనేని నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో హెరిటేజ్ డెయిరీ అండ

- పాలు పోస్తే.. ప్రయోజనాలెన్నో
- పాడి రైతుకు రూ.60 వేల సాయం



**అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** పాడి రైతుకు కష్టం వస్తే అండగా నిలుస్తామని హెరిటేజ్ డెయిరీ మరోసారి చాటింది.. మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన పాడి రైతు గిలకంశెట్టి నాగలక్ష్మి హెరిటేజ్ కు పాలు సరఫరా చేస్తున్నారు. ఆమెకు చెందిన ఆవు ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ వి. దివాకర్‌రావు రైతు కుటుంబాన్ని పరామర్శించి రూ.60 వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హెరిటేజ్ డెయిరీ పాలు పోసే ప్రతి రైతుకూ కృత్రిమ గర్భధారణ సేవను రాయితీపై రూ.50కే అందిస్తున్నట్లు దివాకర్‌రావు తెలిపారు. ఆడ దూడ పుట్టేలా ప్రత్యేక కృత్రిమ గర్భధారణకు రూ.500కే అందిస్తున్నామన్నారు. సభ్యత్వం ఉన్న పాడి రైతు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షల వరకు ఆర్థికసాయం అందించే సదుపాయం ఉందన్నారు. ఏడాదికి రెండుసార్లు బోనస్ కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. పాలు పోస్తే.. ప్రయోజనాలెన్నో హెరిటేజ్ డెయిరీ ఇతర సంస్థలతో పోలిస్తే రైతులకు మెరుగైన ధర చెల్లిస్తోందని మేనేజర్ కూండ్రపు శేష తెలిపారు. పాడి రైతుల అవసరాలను గుర్తించి ఆర్థిక చేయూత, రుణ సదుపాయాలు, పశువైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన రైతులకు సభ్యత్వం కల్పించి సంస్థ అందించే సంక్షేమ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీఆర్ అప్పికొండ నాగేశ్వరరావు, ఆపరేటర్ ఎం. రాజు, ల్యాబ్ అసిస్టెంట్ శ్రీను, వెటర్నరీ అసిస్టెంట్ రాము, పాడి రైతులు పాల్గొన్నారు.

# పోషణతోనే పటిష్ఠ పునాది

- ప్రేమతో నేర్పితే ప్రతిభ వైపు అడుగులు
- తొలి వెయ్యి రోజులు కీలకం!






**అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** చిన్నారుల సంపూర్ణ ఎదుగుదలకు పౌష్టికాహారంతో పాటు తల్లిదండ్రుల ప్రేమ, ప్రోత్సాహం, ఆటపాటల ద్వారా అందించే అభ్యాసం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షికురాలు సుహాసిని తెలిపారు. జాతీయ పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా నడింపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.
పిల్లలకు సమతుల ఆహారం అందించడం ద్వారా శారీరక ఎదుగుదలతో పాటు మెదడు వికాసం మెరుగుపడుతుందని సుహాసిని వివరించారు. చిన్నారులతో తల్లిదండ్రులు తరచూ సంభాషిస్తూ, వారితో కలిసి ఆటల్లో పాల్గొని ఆసక్తికరంగా విషయాలను నేర్పించాలని సూచించారు. ప్రేమతో కూడిన వాతావరణం పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. ముఖ్యంగా పుట్టినప్పటి నుంచి తొలి వెయ్యి రోజులు శారీరక, మానసిక వికాసానికి అత్యంత కీలకమైన దశగా పేర్కొన్నారు.
పిల్లల ఎదుగుదలలో తేడాలు, అభివృద్ధిలో ఆలస్యం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తొలిదశలోనే గుర్తించి అవసరమైన సలహాలు, సహాయం పొందాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది అందించే సూచనలను పాటిస్తూ చిన్నారుల ఆరోగ్యం, పోషణపై తల్లిదండ్రులు నిరంతరం శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

# పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి 14 రోజులు రిమాండ్

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బందికి ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై నక్కపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. వీరిద్దరిని ఎలమంచిలి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సిఐజె మురళి తెలిపారు.
నక్కపల్లి మండలం దేవవరం పంచాయతీ పరిధిలోని వడ్డిమెట్ట గ్రామంలో వినాయక చవితి సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన "డాన్స్ బేబీ డాన్స్" కార్యక్రమంలో బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో దేవవరం గ్రామానికి చెందిన గింజాల రమణ, ప్రసాదుల శివాజీ ఘర్షణకు దిగి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు.ఈ ఘటనపై నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 197/2026
యూ /ఎస్ 132 ఆర్ / డబ్ల్యు 3(5) బి.ఎన్.ఎస్ కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో బుధవారం ఇద్దరు నిందితులను ఎలమంచిలి మేజిస్ట్రేట్లో ముందు రిమాండ్ నిమిత్తం హాజరుపరచగా, ఇద్దరు నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారని సిఐ మురళి తెలిపారు.

## ప్రజా సేవకు అంకితమైన నాయకుడు మజ్జి వెంకట్రావు



**ఆనందపురం , పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** .:భీమిలి నియోజకవర్గం తర్లువాడ గ్రామానికి చెందిన మజ్జి వెంకట్రావు ప్రజా సేవ, క్రమశిక్షణ, విలువలతో కూడిన నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. నాటి నుంచి నేటి వరకు తాను నమ్మిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ విజయాలు, పరాజయాలతో సంబంధం లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, పరిశుభ్రతతో పాటు గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అవసరమైన సందర్భాల్లో తన సొంత వనరులను సైతం వినియోగించి సేవా కార్యక్రమాలకు అండగా నిలిచారని ఆయనతో సన్నిహితంగా ఉన్నవారు చెబుతున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రజల సమస్యలను ఓపికగా వింటూ ముందుకు సాగడం ఆయన ప్రత్యేకతగా పేర్కొంటున్నారు. భీమిలి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరింత క్రియాశీలకంగా పనిచేస్తూ నియోజకవర్గ పటిష్టతకు తన వంతు కృషి చేయాలని ఆయన అనుచరులు ఆకాంక్షిస్తున్నారు.

## భీమిలి పోలీసుల వేటలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నిందితుడి అరెస్ట్



**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయస్థాన అరెస్టు వారెంట్ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బగ్చి, ఐపీఎస్ ఆదేశాలు, డీసీపీ మార్గదర్శకత్వంలో భీమిలి సీఐ జి. దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ చర్య చేపట్టారు. క్రైమ్ నంబర్ 139/2022, న్యాయస్థాన కేసు నంబర్ 476/2022కు సంబంధించి ఫిషర్మెన్ కాలనీ, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నానికి చెందిన 48 ఏళ్ల కురందాస్ నాయుడు, తండ్రి జగ్గయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2022లో తన అన్న కురందాసు అప్పలరాజుపై దాడి చేసిన ఘటనకు సంబంధించి అతనిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారెంట్‌ను అమలు చేసేందుకు పోలీసులు నిరంతరం సమాచారం సేకరించి నిందితుడి ఆచూకీ గుర్తించారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

## వృద్ధుడిని రక్షించిన భీమిలి పోలీసులు



**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు భీమిలి బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించగా భీమిలి పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు.
తాటితూరు ప్రాంతానికి చెందిన కొయ్య కృష్ణ (65) బుధవారం భీమిలి బీచ్‌కు చేరుకుని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు గుర్తించి రక్షించారు. అనంతరం భీమిలి సీఐ జి. దివాకర్ యాదవ్ ఆయన కుమారుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, వృద్ధుడిని జాగ్రత్తగా చూసుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తగిన సూచనలు చేసిన అనంతరం కొయ్య కృష్ణను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి వృద్ధుడి ప్రాణాలను కాపాడిన భీమిలి పోలీసుల చర్యపై స్థానికులు అభినందనలు తెలిపారు.

## అన్నా క్యాంటీన్ల సిబ్బందికి శిక్షణ



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును మెరుగుపరిచేందుకు మెప్మా డీఆర్పీల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం విశాఖపట్నంలోని 35వ వార్డు ఫ్రూట్ మార్కెట్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్లో డీఆర్పీ చిల్లా జయలక్ష్మి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆహార నాణ్యత, సిబ్బంది పనితీరు, ప్రజలతో సత్సంబంధాలు, సేవల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ నిర్వహించారు. అనంతరం స్థానిక కూటమి నాయకులతో కలిసి అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పేద ప్రజలకు సమయానికి నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ల వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అన్నా క్యాంటీన్ల జోనల్ హెడ్ శర్మ, పర్యవేక్షకుడు అప్పలరాజు, 35వ వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్ రుప్ప శ్రీధర్, స్థానిక జనసేన నాయకులు లంక త్రినాధరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కండిపల్లి వరలక్ష్మి, బోదల రమేష్, జి. చిన్న తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో 9, 11వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులు

- ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- సెప్టెంబర్ 30తో ముగియనున్న ఆన్ లైన్ రిజిస్ట్రేషన్లు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** : నవోదయ స్కూల్ లో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్, 30 2026 ముగియనున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 2027 ఏప్రిల్ 10న లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్, సెప్టెంబర్ 16, 2026 జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027--28 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (రాజూరు)-2027కు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ కమిషనర్ కార్యాలయం సమాచారం మేరకు లేటరల్ ఎంట్రీ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 30, 2026 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్షను 2027 ఏప్రిల్ 10వ తేదీ (శనివారం) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయాలు పనిచేస్తున్నట్లు వివరించారు. 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 9వ తరగతికి: ఆన్‌లైన్ దరఖాస్తు పోర్టల్: (https://cbseitms .nic.in/2026/nvsix_9 11వ తరగతికి: ఆన్‌లైన్ దరఖాస్తు పోర్టల్: (https://cbseitms .nic.in/2026/nvsxi_11 అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సెప్టెంబర్ 30, 2026 లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ ప్రవేశ అవకాశంపై విస్తృత అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులు, పాఠశాలల యాజమాన్యాలను కోరారు. ప్రవేశ పరీక్ష, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ (https://navodaya.gov.in) ద్వారా తెలుసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన





**అయినాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** పద్మనాభం మండలం అయినాడ గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాగిని ప్రధాన పంటగా సాగు చేస్తూ, అనుబంధ పంటలుగా బొబ్బర్లు, కందులు, పెసలు, మినుములు, గంటెలు, జొన్న తదితర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ప్రయోజనాలు పొందవచ్చని కార్యక్రమంలో వివరించారు.
ప్రకృతి వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించుకోవాలని సూచించారు. పంటల వైవిధ్యాన్ని పెంచుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బుస్సల శ్యామల, రీజినల్ ఆఫీసర్ ప్రకాశ్, సందక కంచి నాయుడు పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎఫ్‌ఏలు, ఎఫ్‌ఎంటీలు, ఐసీఆర్‌పీలు, ఎల్‌యూలు, రైతులు పాల్గొని అనుబంధ పంటల సాగు విధానాలు, ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు.

## భీమిలిలో పోషకాహారంపై అవగాహన



**భీమునిపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** :భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తోట వీధి అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణ మాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి, పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారం ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.
అంగన్‌వాడీ కేంద్రంలో హెచ్‌సీఎం, హాట్ కుక్డ్ మీల్ తదితర అంశాలపై తల్లులకు వివరించారు. చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహార వంటకాలను తయారు చేసి చూపించారు. పిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించేలా తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సెక్టార్ సూపర్‌వైజర్ బి. నాగమణి, తోట వీధి అంగన్‌వాడీ కార్యకర్త కె. వెంకటలక్ష్మి, అప్పికొండ వీధి అంగన్‌వాడీ కార్యకర్త ఎం.వి. రమాకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు, ప్రీ-స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

## వాంబే కాలనీలో వినాయక మండపాలకు రూ.2 లక్షల విరాళం





**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** విశాఖ నగరంలోని వాంబే కాలనీ పరిధిలో ఏర్పాటు చేసిన 45 వినాయక మండపాలకు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు సుమారు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో ధూప, దీప, నైవేద్యాల నిర్వహణకు ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా పిళ్లా వెంకటరావు కాలనీలోని ప్రతి వినాయక మండపాన్ని స్వయంగా సందర్శించి, నిర్వాహకులకు విరాళాలను అందజేశారు. అనంతరం ఆయా మండపాల్లో వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో 7వ వార్డు అధ్యక్షుడు కానూరి అచ్యుత్‌రావు, టీడీపీ సీనియర్ నాయకులు పోతినాయుడు, పీవీఎస్ఎన్ బాలాజీ, మల్లువలస రాము, కొమర బ్రదర్స్‌తో పాటు కిషోర్, నాగేశ్వరరావు, భవానీ, లావణ్య, రోజా, వెంకటలక్ష్మి, పీసా చిన్నారావు, అనిల్, సురేష్, రాజేష్, సెన్నా గోవింద్, బడిగింటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ ఆదేశాల అమలుపై ప్రశ్నలు




**విజయవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్, ఫుడ్‌కోర్ట్‌కు అనుమతులు రద్దు చేసినప్పటికీ కార్యకలాపాలు కొనసాగడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఎగ్జిబిషన్‌కు వచ్చే వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. పోలీస్, ఫైర్, వీఎంసీ అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.వినాయక చవితి ఉత్సవాలకు తాము వ్యతిరేకం కాదని, భక్తి పేరుతో అనుమతులు, నిబంధనలు ఉల్లంఘించడానికే వ్యతిరేకమని పేర్కొంటున్నారు. రాజకీయ హోదా ఎవరికైనా ఉన్నా ప్రజా స్థలాలు, ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలని కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో జామి వెంకట్రావు ప్రత్యేక చొరవ



**నరసన్నపేట, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** నరసన్నపేట పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జామి వెంకట్రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.
ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు.
తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తున్నారు. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ప్రజల నుంచి సమాచారం అందిన వెంటనే స్పందిస్తూ పరిష్కారం కోసం అనుసరిస్తున్నారని స్థానికులు తెలిపారు.
రాజకీయ కార్యకలాపాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో సంప్రదింపులు కొనసాగించడం ద్వారా ప్రజల సమస్యలపై జామి వెంకట్రావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానికులు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫోటో అభివృద్ధి సంఘం జాయింట్ సెక్రటరీగా వి. సంతోష్ కుమార్

### కాకినాడలో ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం

**కాకినాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫోటో అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవం కాకినాడలో ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఫోటోగ్రఫీ రంగానికి చెందిన నాయకులు, ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గానికి చెందిన వి. సంతోష్ కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫోటో అభివృద్ధి సంఘం జాయింట్ సెక్రటరీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఫోటోగ్రాఫర్ల ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ ప్రయోజనాల కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి కాకినాడ జిల్లా ఎమ్మెల్యే, రాష్ట్ర ఫోటో అభివృద్ధి సంఘం నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, ఫోటోగ్రఫీ రంగ ప్రముఖులు తదితరులు హాజరయ్యారు.
జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన వి. సంతోష్ కుమార్‌కు రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల తరఫున పలువురు అభినందనలు తెలిపారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారం, వృత్తి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# ఏయూ మైదానంలో పట్టాల పండుగకు చకచకా ఏర్పాట్లు





- ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్
- ప్రజల భాగస్వామ్యం, రవాణా, మౌలిక వసతులపై ఎంపీ, ఎమ్మెల్యేలతో చర్చ

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** : ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా 26,426 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ బుధవారం పరిశీలించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి ప్రధాన వేదిక, లబ్ధిదారుల గ్యాలరీలు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన వసతి తదితర ఏర్పాట్లను ఆయన సునిశితంగా పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులు, నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. భారీ సంఖ్యలో లబ్ధిదారులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన వేదికతో పాటు లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసే గ్యాలరీలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, తాగునీటి కేంద్రాలు, మరుగుదొడ్ల తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే లబ్ధిదారులకు భోజన వసతి కల్పించే విధానం, వారికి అవసరమైన సౌకర్యాలు, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. లబ్ధిదారులకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు, వారు తమకు కేటాయించిన ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా మార్గదర్శకాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులతో కలెక్టర్ చర్చిస్తూ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం, లబ్ధిదారులకు కల్పించాల్సిన వసతులు, రవాణా, పార్కింగ్, భోజనం, తాగునీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారుల రాకపోకల నిర్వహణపై కూడా సమీక్షించారు. పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 26,426 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలనలో స్థానిక ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీ మణికంఠ, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఇతర

# బాలికల రక్షణ, విద్యపై అవగాహన అవసరం



**మధురవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** బాలికల రక్షణ, విద్య, సాధికారతతో పాటు బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల రక్షణ అధికారి కె. హరికృష్ణ అన్నారు.

మధురవాడ బక్కన్నపాలెంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో జిల్లా బాలల రక్షణ విభాగం (డీసీపీయూ), చైల్డ్ హెల్ప్‌లైన్--1098 ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేటీ బచావో--బేటీ పడావో, బాల్య వివాహాల నిర్మూలన, చైల్డ్ హెల్ప్‌లైన్--1098, ఆత్మహత్యల నివారణ, బాలికల సాధికారత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కె. హరికృష్ణ మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించడం, వారి భద్రతను పరిరక్షించడం, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాలలపై లైంగిక నేరాల నివారణకు సంబంధించిన పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, విద్యా హక్కు చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సమస్యలు ఎదురైనప్పుడు పిల్లలు మౌనంగా ఉండకుండా విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని, అవసరమైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్--1098 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలను గుర్తించి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల సహకారంతో సకాలంలో స్పందించడం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చన్నారు. అనంతరం సీడబ్ల్యూసీ సభ్యురాలు రాజేశ్వరి, సంగమిత్ర ఫౌండేషన్ ప్రతినిధి శైలాబాను బాలల హక్కులు, బాలికల సాధికారత, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, బాలల రక్షణకు అందుబాటులో ఉన్న సేవలపై విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ రఘు, కేస్ వర్కర్లు ఆశాజ్యోతి, ఎల్లయ్య, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్ఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- బీచ్‌రోడ్‌లో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర.. ఏయూలో పట్టాల పంపిణీ వేడుక
- ఏర్పాట్లపై సీపీ, ఇతర అధికారులతో కలిసి సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్




**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** ఈ నెల 19న ముఖ్యమంత్రి విశాఖపట్నం పర్యటన సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, 26,426 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, కన్వేయన్స్ డీడ్ల పంపిణీ కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు బీచ్‌రోడ్‌లో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో పట్టాల పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు. లబ్ధిదారులు ఆహ్వాన పత్రికతో వచ్చి సంబంధిత స్టాల్‌లో చూపించిన అనంతరం పట్టాలు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టాల పంపిణీ కోసం 10 గ్యాలరీలు, 100 కౌంటర్లు ఏర్పాటు చేయాలని, నియోజకవర్గాలు, వార్డుల వారీగా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి వార్డుకు ఒక వీఆర్వోను ఇన్‌చార్జిగా నియమించి లబ్ధిదారుల వివరాలను పక్కాగా మ్యాపింగ్ చేయాలన్నారు. లబ్ధిదారులకు ఆహ్వాన పత్రిక అందించే సమయంలోనే పికప్ పాయింట్లు, వేదికకు చేరుకునే మార్గాలు తెలియజేయాలని, రవాణా, భోజన వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు మధ్యాహ్నం 1 గంటకే వేదిక వద్దకు చేరుకుని కేటాయించిన సీట్లలో కూర్చునేలా అవగాహన కల్పించాలన్నారు. పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేసి అవసరమైన వసతులు కల్పించాలని, పార్కింగ్ ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సూచించారు. ఈ నెల 18న రూట్‌మ్యాప్, పార్కింగ్ ఏర్పాట్లపై మాక్‌డ్రిల్ నిర్వహించి అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచాలన్నారు. కలెక్టరేట్‌తో పాటు ప్రధాన వేదిక వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని, 18, 19 తేదీల్లో బీచ్‌రోడ్‌లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్ తదితర అధికారులు

## పదవీ విరమణ పొందిన హోంగార్డుకు రూ.3.94 లక్షల ఆర్థిక సాయం



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** :పోలీస్ శాఖలో నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన హోంగార్డు కె. మురళీకృష్ణకు అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ అండగా నిలిచింది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల హోంగార్డులు తమ ఒకరోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా అందించి రూ.3,94,215 సేకరించారు.

ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ బుధవారం తన కార్యాలయంలో మురళీకృష్ణకు అందజేశారు. పదవీ విరమణ అనంతరం ఆయన సుఖసంతోషాలతో జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు. తోటి హోంగార్డులు చూపిన సేవా స్ఫూర్తిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శోభన్ బాబుకు గంటా శ్రీనివాసరావు అభినందనలు

**విశాఖపట్నం పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఎం. శోభన్ బాబు బుధవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శోభన్ బాబును గంటా శ్రీనివాసరావు అభినందించారు. గతంలో టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శిగా పనిచేసిన శోభన్ బాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని గంటా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. అనంతరం శోభన్ బాబును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు ఏపీపీ పార్థసారథి, బుగత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# వార్డుల్లో పనులు వేగవంతం చెయ్యాలి: గంటా

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** : వార్డుల్లో అభివృద్ధి పనులు. వేగవంతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని వార్డు అధ్యక్షులతో ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. వార్డుల్లో అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలను సమీక్షించారు. పెండింగ్ పనులను గుర్తించి వాటిని గడువులోగా పూర్తి చేయించాలన్నారు. వర్షాభావంతో నీటి సమస్య తీవ్రతరమైన కారణంగా అవసరమైన ప్రాంతాల్లో బోర్లు తవ్వించాలని సూచించారు. తారు ధరలు పెరగడంతో మందకొడిగా జరుగుతున్న బీటీ రోడ్ల పనుల వేగం పెరిగేలా ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోనుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేలా నిరంతరం వార్డుల్లో తిరగాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధనకు సన్నద్ధం కావాలని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, నాగోతి సత్యనారాయణ, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పంచదార్ల శ్రీనివాస్, గొలగాని నరేంద్ర, తమ్మిన సూరిబాబు, జీరు సత్యం, పాసి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసును ఛేదించిన ఆనందపురం పోలీసులు

**పైడితల్లి ఆచూకీ లభ్యం.. బంగారంతో సహా కుటుంబ సభ్యులకు అప్పగింత**






**ఆనందపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించి, కనిపించకుండా వెళ్లిన వ్యక్తిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 29న ముర్రపాల పైడమ్మ తన భర్త పైడితల్లి (50) కనిపించడం లేదంటూ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో కొంత బంగారాన్ని కూడా తన వెంట తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ వి.వి.సి.ఎం. ఎర్రంనాయుడు దర్యాప్తు బాధ్యతలను హెడ్ కానిస్టేబుల్ వి. శ్రీనివాసరావుకు అప్పగించారు. సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు మిస్సయిన పైడితల్లి ఆచూకీని గుర్తించారు. అనంతరం అతని వద్ద ఉన్న బంగారాన్ని రికవరీ చేసి, పైడితల్లిని బంగారంతో సహా కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. తమ కుటుంబ సభ్యుడిని క్షేమంగా గుర్తించి అప్పగించిన ఆనందపురం పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

**భీమునిపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:**, భీమునిపట్నం మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నూతన మార్గదర్శకాల ప్రకారం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారిణి--1 ఎం. శివరాణి తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 15న ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రకటన జారీ చేసినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 18న మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను పాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 25న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు శివరాణి తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 1:30 గంటలకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక, 2 గంటలకు ప్రమాణ స్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3:30 గంటల వరకు తొలి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా సభ్యులు

పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను బట్టి కమిటీ సభ్యుల సంఖ్య నిర్ణయించనున్నారు. 100 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో 12 నుంచి 15 మంది, 100 నుంచి 500 మంది వరకు ఉన్న పాఠశాలల్లో 15 నుంచి 20 మంది, 500 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో 20 నుంచి 25 మంది సభ్యులు ఉంటారు.

కమిటీలో 75 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. మిగిలిన 25 శాతం సభ్యుల్లో స్థానిక సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సహాయక నర్సు--మంత్రసాని, పూర్వ విద్యార్థులకు ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారిణి తెలిపారు.

## పాఠశాల భద్రతకు 8 సీసీ కెమెరాలు ఏర్పాటు

- విద్యార్థుల భద్రత, అసాంఘిక కార్యక్రమాల నివారణకు గంట రవితేజ సహకారం
- పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు






**విశాఖపట్నం జిల్లా, పెన్ సత్తా, సెప్టెంబర్ 16:** విద్యార్థుల భద్రతతో పాటు పాఠశాల పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాల నివారణకు 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కే. గీతాదేవి అభ్యర్థన మేరకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెంకి శంకర్, వైస్ చైర్మన్ ఆర్. లావణ్య, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపారు. ఎమ్మెల్యే తనయుడు, యువనేత గంట రవితేజ తన సొంత నిధులతో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి సహకరించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల భద్రత, పాఠశాల ఆస్తుల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఈ కెమెరాలు ఉపయోగపడతాయని పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు తెలిపారు.

తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రధానోపాధ్యాయురాలి అభ్యర్థనకు స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గంట రవితేజను పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు అభినందించారు. అలాగే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో చొరవ చూపిన పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెంకి శంకర్ ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులను అభినందించారు.

# మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేరెంట్ కంపెనీ మెటాకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికలపై వినియోగదారులకు ఏ కంటెంట్ లేదా సమాచారం ఎక్కువగా కనిపించాలో/చేరాలో నిర్ణయించడానికి అల్గారిథమ్స్ ఉపయోగిస్తున్నప్పుడు, మెటాను కేవలం సమాచారం చేరవేసే సాధారణ మధ్యవర్తిగా (ఇంటర్మీడియరీ) చూడలేమని ప్రభుత్వ వర్గాలు బుధవారం స్పష్టం చేశాయి. అదొక సర్వీస్ ప్రొవైడర్ కిందికి వస్తుందని, అలానే పరిగణించాలని పేర్కొన్నాయి. మిగతా సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగానే మెటాకు కూడా చట్టపరంగా ఎన్నో బాధ్యతలు ఉంటాయని, ఇక మీదట తన ప్లాట్‌ఫామ్ కంటెంట్ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని వెల్లడించాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ చట్టాల ప్రకారం సోషల్ మీడియా కంపెనీలకు లభించే సేఫ్ హర్బర్ ఇమ్యూనిటీ లేదా చట్టపరమైన రక్షణపై కీలక వ్యాఖ్యలు చేసింది. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో కంటెంట్ వ్యాప్తిని నియంత్రిస్తున్నందున, దానికి లీగల్ ఇమ్యూనిటీ వర్తించదని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ చట్టపరమైన సంరక్షణకు సంబంధించి తుది నిర్ణయం న్యాయస్థానాల చేతుల్లోనే ఉంటుందని, అది వాటి పరిధిలోని అంశం అని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌లోని లోపాలను, కంటెంట్ నియంత్రణలో జరిగిన పొరపాట్లను మెటా బహిరంగంగా ఒప్పుకుందని, ఈ క్రమంలోనే ఇప్పుడు మరింత జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని పేర్కొంది. 'ప్రతి సర్వీస్ ప్రొవైడర్‌కు కొన్ని బాధ్యతలు ఉంటాయి. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో ఉన్న కంటెంట్‌కు బాధ్యత వహించేందుకు అంగీకరించిన తర్వాత నెక్స్ట్ ఫేజ్‌లో మరిన్ని బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**నేరుగా 14జ సైబర్ క్రైమ్ పోర్టల్‌కే సమాచారం!**

అంతకుముందు ఆన్‌లైన్‌లో బాలల లైంగిక వేధింపుల కంటెంట్‌పై మెటా తన తప్పును అంగీకరించిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇక మీదట ఇలాంటి కంటెంట్‌పై భారతీయ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందిస్తామని మెటా హామీ ఇచ్చింది. డిజిటల్ వేదికల్లో పిల్లల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని, నేరస్థుల్ని చట్టం ముందు




నిలబెట్టడానికి ఈ విషయంలో భారత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మెటా అధికార ప్రతినిధి వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై పిల్లల్ని రక్షించడం తమకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని తెలిపారు. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14జ) నిర్వహిస్తున్నటువంటి సైబర్ క్రైమ్ పోర్టల్‌కు చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసుల్ని నేరుగా నివేదించేందుకు మెటా అంగీకరించింది.

ఇప్పటివరకు ఇలాంటి చైల్డ్ సేఫ్టీకి సంబంధించిన కేసుల్ని మెటా అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రెన్ సంస్థకు రిపోర్ట్ చేసేది. ఇప్పుడు భారత్‌లోని చట్టాలకు అనుగుణంగా ఇక్కడ భారతీయ పోర్టల్‌కే సమాచారం ఇచ్చేందుకు ఒప్పుకుంది. అయితే ఇక్కడ భారతదేశంలో చట్ట అమలు సంస్థలకు నేరుగా రిపోర్ట్ చేసేందుకు అంగీకరించిన తొలి గ్లోబల్ టెక్ దిగ్గజం మెటానే కావడం విశేషం.

**నిబంధనలు పాటించకపోతే అంతే సంగతులు!**

భారత్‌లో ఆన్‌లైన్ భద్రత, చైల్డ్ అబ్యూస్ కంటెంట్, డీప్‌ఫేక్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఇటీవల మరింత నిఘాను పెంచింది. నిబంధనలు పాటించకపోతే ఏమాత్రం ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ మెటా అంతర్జాతీయ ఉన్నతాధికారులను కొద్ది రోజుల కిందట భారత్‌కు పిలిపించి కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ విచారించింది. ఇన్‌స్టాగ్రామ్ పెయిడ్ యాడ్స్ ద్వారా చిన్నారుల అశ్లీల కంటెంట్‌ను (చైల్డ్ అబ్యూస్ మెటీరియల్) ప్రోత్సహిస్తున్నారని, ప్రచారం చేస్తున్నారన్న వార్తలపై జులైలోనే ప్రభుత్వం మెటాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే ఆ ప్రకటనలను తొలగించి వివరణ ఇవ్వాలని కూడా ఆదేశించింది. జులై 3న జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్- చీబూజ=) కూడా సుమోటా కింద మెటాకు నోటీసులు జారీ చేసింది. మెటా సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. అంతేకాకుండా ఇక్కడ మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, హెడ్‌ను వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వారం వ్యవధిలోనే రెండోసారి మెటా ఇండియా అధికారులు బుధవారం రోజు కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు.

# భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు

భారత్, అమెరికా సైన్యాల మధ్య వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని ఔలీలోని ఫారిన్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలతో పాటు సైనిక విన్యాసాలను నిర్వహించారు. ఆ డ్రిల్‌లో ఇరుదేశాలకు నుంచి సుమారు 600 మంది సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తరాఖండ్‌తో పాటు రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆ విన్యాసాలు ఏకకాలంలో జరుగుతున్నాయి. ఔలీలో జరిగిన ప్రారంభోత్సవంలో భారత సైన్యానికి చెందిన 14వ పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అమరేశ్ గుంజన్, అమెరికా సైన్యానికి చెందిన 11వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌లోని 1వ పదాతిదళ బ్రిగేడ్ కంబాట్ టీమ్ కమాండర్ కల్నల్ బెన్ జాక్‌మన్ పాల్గొన్నారు. ఆ విన్యాసాలు ఇరుపక్షాలకు కార్యాచరణ పద్ధతులను అంచనా వేసుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాన్ని కల్పిస్తాయని భారత సైనిక అధికారి జనరల్ అమరేశ్ గుంజన్ పేర్కొన్నారు. ఇరుదేశాల సైన్యాల మధ్య బంధాన్ని బలపరుస్తుందని, ఎలాంటి పరిస్థితులలోనైనా కలిసి విజయం సాధించడానికి సిద్ధం చేస్తుందన్నారు. మరోవైపు, అమెరికా సైనిక అధికారి బెన్ జాక్‌మన్ కూడా మట్లాడారు. ఆ డ్రిల్స్? ఇరుదేశ సైనిక దళాల మధ్య మరింత నమ్మకాన్ని పెంపొందించుకోవడానికి సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. పర్వత ప్రాంతాల్లో ఉమ్మడి కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే విన్యాసాల ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ ఉమ్మడి ప్రణాళికలు రచించడం, కార్యాచరణ అమలు, యుద్ధ నైపుణ్యాలు వంటి వాటిపై రెండు దేశాల సైన్యాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయని అన్నారు.

**ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా ఫోకస్**

యుద్ధ అభ్యాస్? 2026 విన్యాసాల్లో ఈసారి ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. నిఘా, శత్రువుల కదలికలను కనిపెట్టే ఆపరేషన్ల కోసం దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన జరగనుంది. ఆ కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్న సైనిక అవసరాలు,




మిలిటరీ టెక్నాలజీకి సంబంధించి ఇరుదేశాల సైనిక నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అదేవిధంగా, ఔలిలో పర్వత ప్రాంత యుద్ధ శిక్షణ, అలాగే మహాజన్‌లో ఫీల్డ్ ఫైరింగ్ విన్యాసాల ద్వారా రెండు దేశాల సైన్యాలు తమ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నాయి. వీటి ద్వారా ప్రతికూల పరిస్థితులలో తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటాయి.

**'ఇరుదేశాల సైనికులు కలిసి శిక్షణ పొందుతారు'**

మరోవైపు, భారత్?- అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలపై భారత్?లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్ వేదికగా స్పందించారు. "రానున్న రెండు వారాల్లో, అమెరికా, భారత సైనికులు కలిసి శిక్షణ పొందుతారు. ఈ క్రమంలో ఇరుదేశాల సైనికులు తమ నైపుణ్యాలను పంచుకుంటూ, సంసిద్ధతను పెంచుకుంటారు. అలాగే, ఇరుదేశాల సైనికుల మధ్య సహకారాన్ని మెరుగుపరుచుకుంటారు" అని? పోస్టులో రాసుకొచ్చారు.

**పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు సువర్ణావకాశం**

ఇదిలా ఉండగా, ఔలీ ప్రాంతం సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉంటుంది. అంతేకాదు, సవాలుతో కూడిన భౌగోళిక పరిస్థితులను కలిగి ఉంటుంది. ఈ భూభాగం పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు ఒక మంచి అవకాశాన్ని అందిస్తాయి. అదే సమయంలో భారత సైనికులకు కూడా అమెరికా సైన్యం అవలంభిస్తున్న ఆధునిక పోరాట పద్ధతులు, ఆపరేషన్? పద్ధతులను నేర్చుకునే అవకాశం కలుగుతుంది.

కాగా, యుద్ధ అభ్యాస్ 2026 సైనిక డ్రిల్స్ సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యాయి. ఈసారి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒకేసారి జరుగుతున్నాయి. ఆ విన్యాసాలు రెండు వారాల పాటు జరిగి సెప్టెంబర్? 28న ముగియనున్నాయి. భారత్, అమెరికా మధ్య ఏటా ఈ విన్యాసాలు జరుగుతుంటాయి. ఇరుదేశాల మధ్య రక్షణ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడంలో డ్రిల్స్? కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఈసారి భౌగోళిక వాతావరణంలో నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో లేదా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఇరు దేశాల సైన్యాలు కలిసికట్టుగా, సమర్థవంతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు విన్యాసాలు దోహదపడనున్నాయి.

# రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై బ్యాంక్ ఛార్జీలు ఉండవు

**న్యూఢిల్లీ :** యూపీఐ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. రూ.2,000 వరకు జరిగే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే రూ.2,000 వరకు ఖీబీఖజీఎ డెబిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపులపైనా బ్యాంకులు ఛార్జీలు వసూలు చేయడానికి వీలు లేదని పేర్కొంది.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఖజీఎఎవనిబి జీనిట గావబిబిశ్రీవఎవనిబి గాఎబబివఎబ ంఞబి కింద నిబంధనల్లో మార్పులు చేస్తూ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.రూ.2,000 వరకు యూపీఐ రూపే డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసే వ్యక్తుల నుంచి బ్యాంకులు, సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష ఛార్జీలు వసూలు చేయకూడదని ప్రభుత్వం తెలిపింది. చెల్లింపు చేసే వ్యక్తితో పాటు చెల్లింపు స్వీకరించే వ్యక్తిపై కూడా ఇలాంటి ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేసింది.ఈ లావాదేవీలను ప్రభుత్వం అధికారికంగా "ఎలక్ట్రానిక్ మోడ్ ఆఫ్ పేమెంట్"గా వర్గీకరించింది. చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశం ఉందంటూ చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు




చేసేందుకు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని గత నెలలోనే ప్రభుత్వం వెల్లడించింది.

ముఖ్యంగా లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వ్యాపారులపై కూడా అన్ని యూపీఐ లావాదేవీలకు వర్తించే విధంగా ఎలాంటి విధించబోమని స్పష్టం చేసింది.భవిష్యత్తులో నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని యూపీఐవ్యాపార లావాదేవీలపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఛార్జీలు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లావాదేవీలపై ప్రస్తుతం వర్తించే పోలిస్తే గణనీయంగా తక్కువగా ఉంటాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపులకు వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తాజా స్పష్టత వినియోగదారులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా చిన్న మొత్తాల చెల్లింపుల్లో అదనపు ఛార్జీల భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేయడంతోయూపీఐ వినియోగం మరింత సులభంగా కొనసాగనుంది.

## మక్కాపై డ్రోన్ దాడి యత్నం.. స్పందించిన భారత్




సౌదీ అరేబియాలోని మక్కా సమీపంలో చోటుచేసుకున్న డ్రోన్ దాడి యత్నాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. సౌదీ అరేబియా రక్షణ దళాలు ఈ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఆ ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలు ఆందోళనకరమని భారత విదేశాంగ శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు మక్కా అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం. అలాంటి పవిత్ర ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి యత్నించడం అత్యంత ఆందోళనకరమైన విషయం" అని వ్యాఖ్యానించారు. సౌదీ అరేబియా సార్వభౌమాధికా రానికి భంగం కలిగించేలా, పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా సాగుతున్న ఈ దాడులను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం త్వరితగతిన నెలకొనాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన డ్రోన్‌ను సౌదీ వైమానిక దళాలు ప్రాథమిక దశలోనే గుర్తించాయి. మక్కా నగరంలోని నిషిద్ధ గగనతలంలోకి అది ప్రవేశించకముందే గాలిలోనే అడ్డగించి ధ్వంసం చేశాయి. ఈ హేయమైన చర్యను సౌదీ సంకీర్ణ దళాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కి అల్ మల్కి తీవ్రంగా పరిగణిస్తూ, ఇదొక ప్రణాళికాబద్ధమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఉమ్రా యాత్రికులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ముస్లింల మతపరమైన మనోభావాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. రెండు పవిత్ర మసీదుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, దీనికి విఘాతం కలిగించే హౌతీలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. 2017లో బాలిస్టిక్ క్షిపణితో దాడి చేసిన తర్వాత, మక్కాను లక్ష్యంగా చేసుకోవడం ఇది రెండోసారి అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్‌లాండ్, నార్వే, నమీబియా, యూకే వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలోని 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) బుధవారం రిలీజ్ చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్థాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145) పొందిన దేశంగా నిలిచింది. ఇరాన్(144), పాకిస్థాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి.

డబ్ల్యూఈఎఫ్ సూచిక ప్రకారం, 2006లో తొలిసారి తాము తొలిసారి విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌ను, తాజా సూచికతో పోల్చింది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్. ప్రపంచంలోనే అత్యధిక జనాభా (సుమారు 150 కోట్లు) ఉన్న భారత్‌లో 'ప్యారిటీ స్కోర్' 64.5 శాతంగా ఉంది. ఇది ప్రపంచ సగటు కంటే తక్కువ. గతేడాదితో పోలిస్తే భారత్ 'ప్యారిటీ స్కోర్' కొద్దిగా మెరుగుపడింది. మొత్తంగా 2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. దీనికి ప్రధాన కారణం విద్యా రంగంలో సాధించిన పురోగతి అని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది.

ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో దేశ ప్యారిటీ స్కోర్ మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. ఆరోగ్య- జీవన స్థితిగతుల విభాగంలోనూ ఈ ఏడాది భారత్ మెరుగైన ప్యారిటీ స్కోర్‌ను సాధించింది.

'పూర్తి సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుంది'

2006 నుంచి తాము పర్యవేక్షిస్తున్న దాదాపు ప్రతి ఆర్థిక వ్యవస్థ లింగ సమానత్వంలో పురోగతి సాధించిందని జెనీవాకు చెందిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తెలిపింది. అయితే పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరం ఇప్పుడు 69.2 శాతానికి తగ్గిందని, ఇది గతేడాదితో పోలిస్తే 0.4 శాతం పాయింట్లు ఎక్కువని అభిప్రాయపడింది. ఏదైనా కంపెనీ లేదా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవులలో మహిళలు 19.1 శాతం మాత్రమే ఉన్నారని చెప్పింది. మహిళలు నిర్వహిస్తున్న ప్రతి 10 మంత్రిత్వ శాఖలలో కేవలం ఒకటి మాత్రమే సరైనదని పేర్కొంది.

**ఏఐ రంగంలో కూడా మహిళలు తక్కువే!**

అలాగే కృత్రిమ మేధ (ఏఐ) ఇంజినీర్లలో ప్రతి ఐదుగురిలో ఒకరి కంటే తక్కువ మంది మహిళలు ఉన్నారని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జాహిది తెలిపారు. ఏఐ సంస్థలలో ప్రతి స్థాయిలో మహిళ ప్రాతినిధ్యం తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇరవై సంవత్సరాల డేటా ప్రకారం అన్ని దేశాలు లింగ సమానత్వం సాధించవచ్చని తెలుస్తోందన్నారు. సమానత్వం అనేది వృద్ధికి, పోటీతత్వానికి పునాది అని అభిప్రాయపడ్డారు.

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

సీనియర్ నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అనంత్ నాగ్‌కు భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను.. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అధికారికంగా వెల్లడించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కెవాడియాలో జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో అనంత్ నాగ్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అనంత్ నాగ్‌కు అభినందనలు తెలిపారు. అద్భుతమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో, ముఖ్యంగా కన్నడ చిత్రసీమలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ గౌరవానికి ఆయన అన్ని విధాలా అర్హులని ప్రధాని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగరకట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతో పాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా, ఆర్.కె. నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన 'మాల్గుడి డేస్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను ఐదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌ను, గత ఏడాది (2025) భారత ప్రభుత్వం దేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

## సంపాదకీయం

# ...ద్విధ్రువం వైపు!?

దిల్లీలో బ్రిక్స్ సదస్సు ముగియగానే, ప్రపంచ భౌగోళిక-రాజకీయ దృష్టి వాషింగ్టన్ వైపు మళ్లింది. వచ్చేవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అక్కడ పర్యటిస్తారు. దిల్లీలో "బహుళధ్రువత్వం" ప్రధాన నినాదంగా ఉంటే, వాషింగ్టన్‌లో మాత్రం "ద్విధ్రువత్వం" ప్రధానం కావొచ్చు. ఈ ఏడాది డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్ మధ్య జరగనున్న రెండో భేటీ తీవ్రస్థాయిలో సాగుతున్న అమెరికా-చైనా చర్చల పరంపరలో భాగం. వాషింగ్టన్ తర్వాత, ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా చైనాలోని షెన్‌జెన్‌లో ట్రంప్, షీ జిన్‌పింగ్ మళ్లీ కలిసే అవకాశముంది. ప్రస్తుతం వినిపిస్తున్న త్రిపాక్షిక సదస్సు ఊహాగానాలు నిజమైతే, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా అక్కడ చేరవచ్చు. అప్పుడు ప్రపంచం జీ-2 నుంచి సాధ్యమైన జీ-3 నమూనావైపు మళ్లొచ్చు. బ్రిక్స్, ఏపీఈసీ, జీ-20 వంటి ఈ బహుళపక్ష సమావేశాలు చాలావరకు వార్షిక సాధారణ కార్యక్రమాలే. దిల్లీ సదస్సుకు అంటుకున్న రాజకీయ మెరుపు ఎంతున్నా, ఇలాంటి సమావేశాల్లో గణనీయమైన సామూహిక పురోగతి అరుదు. అయితే ఇవి కీలకమైన ద్వైపాక్షిక సమావేశాలు జరిగేందుకు ఉపయోగకరమైన వేదికలవుతాయి. ఉదాహరణకు, దిల్లీ బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్-చైనా సంబంధాలను పునరుద్ధరించేందుకు చేసిన ప్రయత్నమే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడాది బహుళపక్ష సదస్సులకు కొంత ప్రాధాన్యం చేకూరడానికి కారణం, ట్రంప్ అమెరికా విదేశాంగ విధానంలో సృష్టిస్తున్న అలజడే. ఈ అలజడి వెనుక దాగివున్న మరింత ముఖ్యమైన నిర్మాణాత్మక మార్పు ఏమిటంటే, ప్రపంచ శక్తి పంపిణీలో చైనా, అమెరికాలకు అనుకూలంగా జరుగుతున్న మార్పు. బ్రిక్స్, జీ-7 రెండూ క్రమంగా ఒకే ఒక్క శక్తి ఆధిపత్యంతో గుర్తించబడుతున్నాయి. బ్రిక్స్‌లో చైనా, జీ-7లో అమెరికా. 2006లో నలుగురు సభ్యదేశాలతో మొదలైన బ్రిక్ ఫోరమ్‌లో చైనా వాటా బ్రిక్స్ మొత్తం జీడీపీలో సగంకంటే తక్కువగా ఉండేది. ఆ తర్వాత కూటమి 11 సభ్యదేశాలకు విస్తరించినా, ఇప్పుడు చైనా వాటా దాదాపు మూడింట రెండు వంతులకు చేరుకుంది. జీ-7లో కూడా ఇదే తరహా మార్పు కనిపిస్తోంది. మూడు దశాబ్దాల క్రితం జీ-7 మొత్తం నామమాత్రపు ఉత్పత్తిలో ఐదింట రెండు వంతులకంటే తక్కువ వాటా కలిగిన అమెరికా, ఇప్పుడు దాదాపు ఐదింట మూడు వంతుల వాటా కలిగి ఉంది. జపాన్ స్తబ్దత, యూరప్ బలహీన వృద్ధి రేటు, ఇంధనం, మూలధన మార్కెట్లు, కృత్రిమ మేధలో అమెరికా ఆధిక్యత ఈ అంతరాన్ని మరింత విస్తృతం చేశాయి. తన సన్నిహిత భాగస్వాములపై కూడా కఠినంగా వ్యవహరించే ట్రంప్ సుముఖత, ఈ పెరుగుతున్న అమెరికా ఆర్థిక ఆధిక్యతపైనే కొంతమేర ఆధారపడి ఉంది.

బ్రిక్స్‌లో చైనా ఆధిపత్యం, జీ-7లో అమెరికా ఆధిక్యత మనం జీ-2 ప్రపంచం వైపు సాగుతున్నామని అర్థమా? అవసరం లేదు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా ఆధిపత్యంతో కూడిన జీ-2 నిర్మాణంవైపు అభివృద్ధి చెందుతోందన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ ఆర్థిక క్రమాన్ని, సాంకేతిక ప్రమాణాలను, సరఫరా గొలుసులను రూపొందించగల స్థాయి ఉన్న ఏకైక దేశాలు వాషింగ్టన్, బీజింగ్ మాత్రమే. ఈ రెండు దేశాలూ పరస్పరం లోతుగా ఆధారపడి కూడా ఉన్నాయి. ఒకదానిపై మరొకటి ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఇరుపక్షాలూ ప్రయత్నిస్తున్నా, ఒకరి మార్కెట్, సాంకేతికత, మూలధనం నుంచి మరొకరు తేలికగా తప్పించుకోలేరు. ఈ ఏడాది జరిగే ట్రంప్-షీ భేటీలు అమెరికా-చైనా ఉమ్మడి ఆధిపత్యానికి దారితీసే అవకాశం లేదు. వాణిజ్యం, సాంకేతికత, తైవాన్‌పై వారి మధ్య విభేదాలు చాలా లోతైనవి. అయితే నిరంతర ఉన్నతస్థాయి సంప్రదింపుల ద్వారానే తమ మధ్య పోటీని నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని రెండు దేశాలూ గుర్తించాయనే విషయంపైనే ఈ భేటీలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఈ నిర్వహణ స్వభావం మాత్రం మిగిలిన ప్రపంచంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఆర్థికంగా బలహీనపడినప్పటికీ, ఈ రెండు అగ్రరాజ్యాల మధ్య యురేషియా అంతటా సమతుల్యతను ప్రభావితం చేసేంత సైనిక శక్తిని రష్యా ఇంకా కలిగి ఉంది. అందుకే మాస్కో గతంలోకంటే బీజింగ్‌కు మరింత సన్నిహితమైంది, అదే సమయంలో ట్రంప్ రష్యాతో సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీనర్థం అమెరికా రష్యాను చైనానుంచి తేలికగా వేరు చేయగలదని కాదు. ఉక్రెయిన్ విషయంలో మాస్కో-యూరప్ మధ్య నెలకొన్న సంఘర్షణ ట్రంప్ రష్యా వ్యూహాన్ని సంక్లిష్టతరం చేస్తోంది. అయితే ఉక్రెయిన్‌లో ట్రంప్ శాంతి కార్యక్రమంలో పురోగతి సాధిస్తే, అది అమెరికా-రష్యా సాన్నిహిత్యానికి, జీ-3 సదస్సుకు వేదికగా మారవచ్చు.

జీ-7 కాకుండా, జీ-20లో చైనా, రష్యా, భారత్, బ్రెజిల్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా వంటి ముఖ్యమైన పాశ్చాత్యేతర శక్తులు భాగంగా ఉన్నాయి. బ్రిక్స్ కాకుండా, ఇందులో అమెరికా, యూరప్, జపాన్ కూడా ఉన్నాయి. మారుతున్న శక్తి పంపిణీ కారణంగా జీ-20లో అమెరికా, చైనాల ప్రాధాన్యం గతంలో కంటే మరింత పెరిగింది. ఈ నెలలో వాషింగ్టన్‌లో జరిగిన జీ-20 ఆర్థిక మంత్రుల సమావేశంలో అమెరికా-చైనా మధ్య విభేదాలు వాణిజ్య మిగులు, ఎగుమతుల ఆధారిత వృద్ధిపై భాషపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఉమ్మడి ప్రకటన విడుదల కాకుండా అడ్డుకున్నాయి. అమెరికా, చైనాల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు, ఆర్థికరంగంలో సామూహిక చర్య తీసుకునే సామర్థ్యం జీ-20కు ఉందన్న ఆశను అవి దెబ్బతీస్తాయి. అయితే వాషింగ్టన్-బీజింగ్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు కూడా జీ-20లోని ఇతర భాగస్వాముల ప్రయోజనాలకు భంగం కలిగించే అవకాశం ఉంది. భారత్ బహుళధ్రువ ప్రపంచాన్ని కోరుకుంటున్నప్పటికీ, మనం ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదు. ప్రస్తుతానికి, జీ-2 కానీ జీ-3 కానీ, అంతర్జాతీయ వ్యవస్థ భవిష్యత్తును నిర్దేశించనున్న ఈ తీవ్రమైన మహా క్రీడతో దిల్లీ వ్యవహరించాల్సి ఉంటుంది. ఏపీఈసీ, బ్రిక్స్, ఈయూ, జీ-7, నాటోవంటి సంస్థలు ప్రపంచ క్రమాన్ని రూపొందించవు, అవి మహా శక్తుల రాజకీయాలు నిర్దేశించే పరిధుల్లోనే పనిచేస్తాయి. దిల్లీలో బ్రిక్స్ వేడుక ముగిసిన నేపథ్యంలో, భారత విదేశాంగ విధాన వర్గం తన స్వీయ సంతృప్తి కలలోనుంచి మేల్కొని, అమెరికా, చైనా, రష్యాల మధ్య మారుతున్న ప్రపంచ శక్తి పంపిణీని, భౌగోళిక-రాజకీయ పునర్వ్యవస్థీకరణను నిశితంగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### పనికొచ్చే పలుకు



# నిలకడే.. నిజమైన పవర్

మీరు కోరుకునే జీవితం కేవలం క్షణికమైన ప్రోత్సాహంతో లభించదు. ఒక మోటివేషనల్ రీల్‌చూసి ఉత్సాహపడటం, రెండు రోజులు జిమ్‌కు వెళ్లడం, ఒక వారం కొత్త స్కిల్ నేర్చుకోవాలని ప్రయత్నించడం.. ఇవన్నీ మంచివే. కానీ ఇవి మాత్రమే జీవితాన్ని మార్చవు. మీకు మీరు చేసుకున్న ప్రమాణాలను ఎంత నిలబెట్టుకోగలరు అన్నదే అసలైన మార్పుకు కొలమానం. క్రమశిక్షణతో గడిపే ప్రతి రోజూ మీ భవిష్యత్తుకు బలమైన పునాది రాయి. అలా నిలకడగా కష్టపడుతూ పోతే, ఒకరోజు అసాధ్యమనుకున్న జీవితం కళ్లముందు ఆవిష్కృతమవుతుంది. ఇవాళ్టి తరం అంటే, స్క్రోలింగ్‌తో గడిపే క్షణాల్లో ప్రతిదీ వేగంగా, తక్షణంగా జరిగిపోవాలని ఆశించే తరం. ఒక రీల్ 15 సెకన్లలో కథ చెప్పేస్తుంది, ఒక ఆర్డర్ 10 నిమిషాల్లో ఇంటికొచ్చేస్తుంది. ఈ "తక్షణ సంతృప్తి" అలవాటు మెల్లగా మన మెదడును కూడా అలాగే మార్చేస్తుంది. దేనికైనా వెంటనే ఫలితం కావాలని ఆశించేలా చేస్తుంది. కానీ నిజ జీవితంలో గొప్ప విజయాలు, బలమైన కెరీర్లు, ఆరోగ్యకరమైన శరీరాలు, లోతైన సంబంధాలు.. ఇవేవీ ఒక్క రాత్రిలో పుట్టుకురావు. అవన్నీ నెలలు, సంవత్సరాల తరబడి చేసే చిన్న చిన్న ప్రయత్నాల మొత్తమే. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడమే జెన్-జీకి అవసరమైన మొదటి మైండ్‌సెట్ మార్పు.

ఒక మొక్కకు నిత్యం నీళ్లు పోస్తే, మొదటి వారం మార్పు కనిపించదు. నెలల తరబడి ఆ పనిని కొనసాగిస్తే, ఒకరోజు అది పెద్ద చెట్టుగా మారుతుంది. మనుషుల విషయంలోనూ ఇదే జరుగుతుంది. జిమ్‌కు వెళ్లిన మొదటివారంలో అద్దంలో ఎలాంటి మార్పూ కనిపించదు. ఇక్కడే చాలామంది నిరాశ చెంది మధ్యలోనే వదిలేస్తారు. కానీ నిజమైన మార్పు ఎప్పుడూ కంటికి కనిపించని దశలోనే జరుగుతుంది. లోపల్లోపల బలం పెరుగుతుంది, అలవాట్లు స్థిరపడతాయి. ఈ "కనిపించని పురోగతి" దశను ఎవరైతే ఓపికగా దాటగలరో, వారే చివరికి గొప్ప ఫలితాలను అందుకుంటారు. సోషల్ మీడియా మనకు చూపించేది కేవలం ఫలితాలు మాత్రమే. ఒక వ్యక్తి ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫోటో, ఒక స్టార్టప్ విజయగాథ. కానీ ఆ ఫలితం వెనుక ఉన్న వందల రోజుల నిలకడైన కృషిని మనం చూడం. దీనివల్ల "వీళ్లకు అదృష్టం బాగుంది, నాకు మాత్రం ఎందుకు జరగడం లేదు" అనే భావన కలుగుతుంది. ఇది ప్రమాదకరమైన ఆలోచనా విధానం. ఎందుకంటే ఇది మనల్ని నిలకడగా కష్టపడకుండా, తక్షణ షార్ట్‌కట్‌ల వెంట పరిగెత్తేలా చేస్తుంది. వాస్తవానికి ప్రతి విజయగాథ వెనుక లెక్కలేనన్ని విఫలమైన ప్రయత్నాలు, వదిలేయాలనిపించిన క్షణాలుంటాయి. వాటిని దాటుకుని సాగినవారే చివరికి గెలుస్తారు.

జీవనశైలిలో నిలకడను తీసుకురావాలంటే, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకునే బదులు, చిన్న రోజువారీ అలవాట్లతో మొదలుపెట్టడం మంచిది. "నేను ఆరు నెలల్లో పర్‌ఫెక్ట్ బాడీ తెచ్చుకోవాలి" అనుకునే బదులు, "ఈరోజు 20 నిమిషాలు వ్యాయామం చేస్తాను" అని నిర్ణయించుకోవడం సులభం, సాధించదగినది కూడా. ఈ చిన్న విజయాలే క్రమంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది.. ప్రతిరోజూ 100శాతం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొన్నిరోజులు 60శాతం శక్తితో అయినా ఆ అలవాటును కొనసాగించడమే అసలైన నిలకడ. అలసిపోయిన రోజు కూడా చిన్నగా అయినా ప్రయత్నం చేయడమే, పూర్తిగా మానేయకుండా ఉండటమే విజయానికి కీలకం. చివరగా, జెన్-జీ తరం గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే.. మీరు ఈరోజు చేస్తున్న చిన్న చిన్న ఎంపికలే రేపటి జీవితాన్ని నిర్ణయిస్తాయి. అసాధ్యం అనుకున్న జీవితం అనేది ఒక్క అద్భుతమైన నిర్ణయంతో రాదు. అది వందల సాధారణ రోజుల నిలకడైన కృషితో నిర్మించబడుతుంది. సో, రోజూ మీరు వేసే చిన్న అడుగు, రేపటి మీ పెద్ద గెలుపునకు తొలి మెట్టు అని గుర్తుంచుకోండి.

# ఉచిత ఏఐ వెనుక చైనా వ్యూహం?



భారతీయ స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ఇప్పుడు చైనీస్ పునాదులపై నిర్మించుకుంటున్నాయి. క్వెన్, డీప్‌సీక్, కిమీవంటి చైనీస్ లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు గణనీయమైన వ్యయ పొదుపును అందిస్తూ, అమెరికా అగ్రశ్రేణి మోడళ్లకు దాదాపు సమానంగా పనిచేస్తూ, వాటికంటే కేవలం ఆరు నెలలు మాత్రమే వెనుకబడి ఉన్నాయి. ఏఐ వ్యయాలను నియంత్రించేందుకు భారతీయ కంపెనీలు క్రమంగా చైనీస్ మోడళ్లవైపు మళ్లుతున్నాయని 2026 జూలైలో నిక్కీ ఏషియా నివేదించింది. స్టార్టప్‌లు తమ వ్యయాలను భారీస్థాయిలో తగ్గించుకుంటున్నాయని ఒక వెంచర్ పెట్టుబడిదారుడు వ్యాఖ్యానించారు. ఈ ఓపెన్-వెయిట్ ఔదార్యం కేవలం దాతృత్వమో, చిప్ ఆంక్షలకు ప్రత్యామ్నాయ మార్గమో కాదు, ఇది వేర్వేరు స్వతంత్ర తర్కాలతో మద్దతు పొందిన, మన్నికైన వ్యూహం! అయితే మన్నిక అంటే శాశ్వతం కాదు. 2028 చివరినాటికి తన అగ్రశ్రేణి ఓపెన్-వెయిట్ మోడళ్లకు ప్రాప్యతను చైనా క్రమంగా పరిమితం చేయడం మొదలుపెడుతుందని విశ్లేషకుల అంచనా. చైనా వ్యూహం ఐదు పరస్పర బలపరిచే తర్కాలపై ఆధారపడి ఉంది. మొదటిది వ్యయం. డీప్‌సీక్ తమ ఆర్1 మోడల్‌ను కేవలం 2,94,000 డాలర్లతో శిక్షణ ఇచ్చింది, ఇది ఓపెన్‌ఏఐ లేదా ఆంత్రోపిక్ ఖర్చు చేసే మొత్తంలో అతిస్వల్ప భాగం. అమెరికన్ మోడళ్ల నుంచి డిస్టిలేషన్, నిర్మాణాత్మక సామర్థ్యంలో పురోగతి పరిశోధన-అభివృద్ధి వ్యయాలను గణనీయంగా తగ్గించాయి. రెండోది ప్రతిష్ఠ. డీప్‌సీక్ 2025 జనవరి విడుదల అమెరికా టెక్ స్టాక్‌ల నుంచి సుమారు ట్రిలియన్ డాలర్లను తుడిచిపెట్టింది. షాంఘై ఏఐ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాల్గొనడం, 29 దేశాలతో కూడిన వైకో కూటమి, అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం 5,000 శిక్షణ స్థానాలు.. ఇవన్నీ ఓపెన్-వెయిటింగ్‌ను దౌత్యనీతిగా మలచుకున్న ఉదాహరణలే.

మూడోది వస్తువీకరణ. అమెరికన్ ల్యాబ్‌లు తమ యాజమాన్య వెయిట్ల ద్వారా ఆదాయం సంపాదిస్తుండగా, అత్యధిక వాణిజ్య అవసరాలకు సరిపోయే ఉచిత మోడళ్లు వారి ధరల శక్తిని దెబ్బతీస్తున్నాయి. చైనీస్ ఏఐ కంపెనీలు తమ ప్రత్యర్థి ఉత్పత్తిని అధిగమించాల్సిన అవసరం లేదు, దానికి రుసుము వసూలు చేసే సామర్థ్యాన్నే ధ్వంసం చేస్తే సరిపోతుంది. నాలుగోది మూలధనం. చైనీస్ గృహ పొదుపులను ఆర్థిక అణచివేత ద్వారా ప్రభుత్వ బ్యాంకుల్లో బంధించి, వ్యూహాత్మక రంగాలకు చౌకగా రుణాలిస్తారు. దీని ఫలితమే ప్రపంచ సోలార్, ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లను చదునుచేసిన అదే రాజ్య సబ్సిడీ సమస్య. ఏఐ రంగంలో ఈ ధోరణి 2026 ఆరంభంనాటికి చైనా సైబర్‌స్పేస్ అథారిటీ వద్ద నమోదైన 820 ఎల్‌ఎల్‌ఎంలకు దారితీసింది. ఐదోది మౌలిక వసతులు. ఉచిత మోడళ్లు ఏఐ వినియోగాన్ని పెంచుతాయి, ఇది శక్తి, క్లౌడ్‌వంటి చైనా ఆధిపత్యం చెలాయించే అనుబంధ ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతుంది. క్వెన్‌ను ఉచితంగా ఇస్తూనే అలీబాబా క్లౌడ్ ఆదాయం ఏడాదికి 34 శాతం వృద్ధి చెందింది. చైనా నియంత్రణ సంస్థలు అలీబాబా, బైట్‌డాన్స్, జిపువంటి ప్రముఖ ఏఐ కంపెనీలతో రెండు అంశాలపై సంప్రదింపులు జరుపుతున్నాయని జూలైలో ఫైనాన్షియల్ టైమ్స్ నివేదించింది. విదేశాలకు శిక్షణ డేటా బదిలీని పరిమితం చేయడం, చైనీస్ మోడల్ వెయిట్లను విదేశీ వినియోగదారులు స్వేచ్ఛగా డౌన్‌లోడ్ చేసుకోవడాన్ని కొనసాగించాలా అన్నది ఇందులో ఉన్నాయి. అయితే ఆంక్షలు విధించడం హేతుబద్ధంగా మారాలంటే మూడు షరతులు నెరవేరాల్సి ఉంటుందని స్పష్టమవుతోంది. మొదటిది ఏకీకరణ. బీజింగ్ ఐదు కంపెనీలను సమన్వయం చేసుకోగలదు, కానీ 800 కంపెనీలను చేయలేదు. "వంద మోడళ్ల యుద్ధం" నుంచి "టాప్ ఫైవ్ బేసిక్ మోడళ్లు" వైపు మళ్లుతున్నట్టు జిన్హువా ఇప్పటికే ప్రకటించింది. చిప్ ఎగుమతి ఆంక్షల ద్వారా చైనీస్ ల్యాబ్‌ల వ్యయాలను పెంచుతూ, అమెరికా ఎగుమతి నియంత్రణలు ఈ ఏకీకరణ ప్రక్రియనే వేగవంతం చేస్తుండటం ఒక వ్యంగ్యం.

రెండోది లాక్-ఇన్. ప్రపంచ డెవలపర్లు చైనా క్లౌడ్ వ్యవస్థలో లోతుగా ఇమిడిపోకముందే చైనా యాక్సెస్‌ను పరిమితం చేస్తే, వారు సులభంగా వేరేచోటికి మారిపోతారు. ఈ పరిమితి ప్రస్తుతం చేరుకోవడానికి ఇంకా చాలా దూరంలో ఉంది. మూడోది సంతృప్తత. అమెరికన్ అగ్రశ్రేణి ఏఐ ల్యాబ్‌ల ధరల శక్తి తగినంతగా వస్తువీకరణ చెంది, మెటా, మిస్ట్రల్, ఎన్విడియా వంటి చైనేతర ఓపెన్-వెయిట్ విడుదలలు స్వతంత్రంగా ఈ ఒత్తిడిని కొనసాగిస్తున్నప్పుడు, మరిన్ని చైనీస్ విడుదలలు పెద్దగా ప్రయోజనం చేకూర్చవు. ఇక్కడ కూడా అంతరం తగ్గుతున్నా, అది ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. కాబట్టి, ఒకేసారి స్విచ్ ఆఫ్ చేసినట్టు కాకుండా, క్రమానుగత పరిమితులతో కూడిన వేర్వేరు మార్గాలు అవలంబించే అవకాశం ఉంది. ముందుగా అగ్రశ్రేణి మోడళ్లను ఏపీఐ ద్వారా అందించి, ఆరు నెలల నిషేధం తర్వాత వెయిట్లను విడుదల చేయడం; నిర్దిష్ట సామర్థ్య పరిమితికి పైన వాణిజ్య లైసెన్సింగ్ విధించి, చిన్న డిస్టిల్డ్ మోడళ్లను ఉచితంగా వదలడం; వెయిట్లను బహిరంగంగా విడుదల చేస్తూనే టూల్-యూజ్, ఏజెంటిక్ స్కాఫోల్డింగ్‌ను నిలిపివేయడం; వైకో సభ్యదేశాలకు ప్రాధాన్య ప్రాప్యత కల్పించడం వంటివి ఇందులో ఉండవచ్చు. 2028 చివరినాటికి ఈ క్రమానుగత పరిమితి కనిపించడం ప్రారంభమవుతుందని విశ్లేషకుల అంచనా.

ఈ నేపథ్యంలో భారత్ ఏం చేయాలన్నది కీలక ప్రశ్న. మారే వ్యయాలను ముందుగానే అంచనా వేసుకుంటూ, ఈ బహిరంగ పర్యావరణ వ్యవస్థను భారత్ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ శాఖలు, నియంత్రిత రంగాలు వివిధ వ్యవస్థల్లో పనిచేయగల మోడల్-అజ్ఞాత నిర్మాణాలపై ఆధారపడాలి. జీపీయూ స్లైస్‌లపై కంప్యూట్ సబ్సిడీలు అందించే బదులు, ప్రభుత్వ రంగం కోసం 'ఓపెన్‌రౌటర్' తరహా వ్యవస్థను వినియోగించడాన్ని మెయిటీ పరిగణించాలి. అప్లికేషన్లు, పారిశ్రామిక, భాషా డేటా, ఎడ్జ్ ఇన్‌ఫరెన్స్ సిలికాన్ డిజైన్, రంగాల వారీ ఫైన్-ట్యూనింగ్ వంటి భారత్ నిజంగా గెలవగల రంగాలపై దృష్టి పెట్టాలి. ఇది "ఆత్మశక్తి", కొన్ని ఎంచుకున్న విభాగాల్లో సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా స్వీయ-బలం సాధించడం తప్ప, భారత్‌కు అవసరం లేని సంపూర్ణ స్వావలంబన కాదు. చివరగా, ఈ అవకాశాన్ని దౌత్యపరంగా భారత్ వినియోగించుకోవాలి. బహుళపక్ష వేదికలపై ఓపెన్-వెయిట్ నిబంధనలను రూపొందించే ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలి, ఎందుకంటే ఈ ఉమ్మడి వనరు ఇంకా బహిరంగంగానే ఉంది, దీనికి చట్టబద్ధత కోసం బీజింగ్‌కు ఇప్పటికీ అవసరం ఉంది.

ఎక్కువగా, భారత్ తన అవసరాలను తీర్చే అప్లికేషన్లలో ఏఐని వినియోగిస్తూ, ఏకీకృతం చేస్తోందే తప్ప, అగ్రశ్రేణి మోడళ్లను నిర్మించడం లేదు. వివిధ రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు వేగవంతమైన వ్యాప్తి, 'ఏఐ సార్వభౌమాధికార ప్రదర్శన'కంటే చాలా ముఖ్యం. ఇందుకు ప్రస్తుతం అమెరికా, చైనా వ్యవస్థల నుంచి లభిస్తున్న ఓపెన్ మోడళ్లే సరిపోతాయి. అయితే ఇవి సరిపోవడానికి కారణం, ఈ మోడళ్లను ఉచితంగా అందించడం ద్వారానే ప్రస్తుతం ఒక వ్యూహాత్మక పోటీ సాగుతోందన్నదే, ఆ పోటీ ఈ దశలోనే శాశ్వతంగా కొనసాగదు. ఈ ఓపెన్ పర్యావరణ వ్యవస్థలను సద్వినియోగం చేసుకుంటూనే, భవిష్యత్తులో ఎదురయ్యే అంతరాయాలను తట్టుకుని నిలబడేలా భారత్ తనను తాను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■



మీ ఆహారం, ప్రొటీన్, జిమ్ దుస్తులు, సప్లిమెంట్లు, జిమ్ సభ్యత్వం కోసం ఎంత ఖర్చు చేశారో ఎప్పుడూ లెక్కపెట్టకండి. జీవితంలో కొన్ని సంఖ్యలను లెక్కించకుండా వదిలేయడమే మంచిది. ఎందుకంటే మీ ఆరోగ్యంపై పెట్టే ఖర్చు నష్టం కాదు, అదొక పెట్టుబడి. ప్రతి రూపాయినీ బేరీజు వేస్తూ కూర్చుంటే, అసలు లక్ష్యమైన ఆరోగ్యం, క్రమశిక్షణ వెనక్కి పడిపోతాయి. ఖర్చు కంటే ఫలితమే ముఖ్యం, ఆరోగ్యమే అసలైన సంపద అని గుర్తుంచుకోండి. అదే మిమ్మల్ని బలంగా, ఆరోగ్యంగా ముందుకు నడిపిస్తుంది.

-మహాదేవ

### వింతల్లో వింతలు

# స్టీక్‌హౌస్ కిచెన్‌లో బొద్దింకల విందు!




జార్జియాలోని 'లాంగ్‌హార్న్ స్టీక్‌హౌస్' కిచెన్‌లో బొద్దింకలు స్వైర విహారం చేస్తున్న వీడియో వైరల్ కావడంతో సదరు రెస్టారెంట్ ఇరకాటంలో పడింది! ఉద్యోగి షాన్ హెడ్లీ, పైస్థాయివారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో, చివరికి తానే కెమెరా పట్టుకున్నాడు. వంటగదిలో బొద్దింకలు క్యాట్‌వాక్ చేస్తుంటే, పక్కనే చెత్తకుప్పలు వెల్‌కమ్ చెబుతున్నాయి! "పరిస్థితి మనుషులు పనిచేయడానికి తగదు" అంటూ ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేయగానే, నెటిజన్లు రెస్టారెంట్‌పై విరుచుకుపడ్డారు. "మేం మిమ్మల్ని విషపూరితం చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత మాదే" అంటూ ఒకరు వ్యాఖ్యానించారు.

## విండీస్ సిరీస్‌కు భారత జట్ల ప్రకటన..

# రోహిత్, కోహ్లి కొనసాగింపు

ఈ నెలాఖరులో వెస్టిండీస్‌తో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం భారత జట్లను ఇవాళ ప్రకటించారు. వన్డే జట్టుకు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, టీ20 జట్టుకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కొనసాగారు. కేఎల్ రాహుల్, తిలక్ వర్మ వన్డే, టీ20 జట్లకు ఉప నాయకులుగా వ్యవహరించనున్నారు. స్టార్ ద్వయం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డే జట్టులో కొనసాగగా.. రిషబ్ పంత్‌కు అవకాశం దక్కలేదు. ఆకిబ్ నబీ, నమన్ ధిర్‌కు తొలిసారి వన్డే జట్టులో అవకాశం దక్కింది. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. రెండు జట్లలో అతడికి చోటు దక్కలేదు.



**వన్డే సిరీస్‌కు భారత జట్టు**

శుభ్‌మన్ గిల్ (సి), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధృవ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధిర్

**టీ20 సిరీస్‌కు భారత జట్టు**

శ్రేయస్ అయ్యర్ (సి), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), సంజు శాంసన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

**వన్డే సిరీస్ షెడ్యూల్**

తొలి వన్డే: ఆదివారం, సెప్టెంబర్ 27 – మధ్యాహ్నం 2:00 గంటలకు – గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం

రెండో వన్డే: బుధవారం, సెప్టెంబర్ 30 – మధ్యాహ్నం 2:00 గంటలకు – బర్సపారా క్రికెట్ స్టేడియం, గౌహతి

మూడో వన్డే: శనివారం, అక్టోబర్ 3 – మధ్యాహ్నం 2:00 గంటలకు – మహారాజా యాదవేంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, ముల్లన్‌పూర్, న్యూ చండీగఢ్

**టీ20 సిరీస్ షెడ్యూల్**

తొలిటీ20: మంగళవారం, అక్టోబర్ 6 – సాయంత్రం 7:00 గంటలకు – భారత్ రత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం, లక్నో

రెండో టీ20: శుక్రవారం, అక్టోబర్ 9 – సాయంత్రం 7:00 గంటలకు – జేఎస్‌సీఏ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్, రాంచీ

మూడో టీ20: ఆదివారం, అక్టోబర్ 11 – సాయంత్రం 7:00 గంటలకు – హోల్కర్ స్టేడియం, ఇండోర్

నాలుగో టీ20: బుధవారం, అక్టోబర్ 14 – సాయంత్రం 7:00 గంటలకు – రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం, హైదరాబాద్

ఐదో టీ20: శనివారం, అక్టోబర్ 17 – సాయంత్రం 7:00 గంటలకు – ఎం. చిన్నస్వామి స్టేడియం, బెంగళూరు

# కీలక టోర్నీ నుంచి సీఎస్‌కే స్టార్ ఔట్..!

చెన్నై సూపర్ కింగ్స్ యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే మరో కీలక దేశవాళీ టోర్నీకి దూరం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో వచ్చే నెలలో జరిగే ఇరానీ కప్‌కు అతడు అందుబాటులో ఉండడని సమాచారం. నివేదికల ప్రకారం.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఆయుష్‌కు ఇంకా ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు.

**అక్టోబర్ 1 నుంచి ఇరానీ కప్**

రంజీ ట్రోఫీ 2025–26 విజేత జమ్మూ కశ్మీర్‌తో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు ఇరానీ కప్‌లో తలపడనుంది. ఈ వన్–ఆఫ్ మ్యాచ్ అక్టోబర్ 1 నుంచి 5 వరకు శ్రీనగర్‌లోని షేర్–ఎ–కశ్మీర్ స్టేడియంలో జరగనుంది. బీసీసీఐ త్వరలో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఫిట్‌నెస్ క్లియరెన్స్ లేకపోవడంతో ఆయుష్ మాత్రే పేరును పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది.

**ఐపీఎల్ 2026లో ఆరు మ్యాచ్‌లే..!**

ఆయుష్ మాత్రేకు గాయం సమస్యలు ఐపీఎల్ 2026లోనే మొదలయ్యాయి. చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన అతడు టోర్నీ మధ్యలో హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురయ్యాడు. దీంతో ఐపీఎల్ సీజన్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026లో ఆయుష్ ఆరు మ్యాచ్‌ల్లో 201 పరుగులు చేశాడు. అతడి బ్యాటింగ్ సగటు 33.50 కాగా, స్ట్రైక్‌రేట్ 177.87గా ఉంది.

**ముంబై టీ20 లీగ్‌కు కూడా దూరం**



ఐపీఎల్ గాయం నుంచి కోలుకుంటున్న సమయంలోనే ఆయుష్‌కు మరో గాయమైంది. ముంబై టీ20 లీగ్ 2026కు ముందు అతడికి మణికట్టు గాయం కావడంతో ఆ టోర్నీకి కూడా దూరమయ్యాడు. ప్రస్తుతం ఆయుష్ ఇండోర్ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, పోటీ క్రికెట్‌లోకి తిరిగి రావాలంటే బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాల్సి ఉంది.

## స్పోర్ట్స్

### కెప్టెన్‌గా రిషబ్ పంత్ ఎంపిక?



బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఇవాళ వెస్టిండీస్ సిరీస్‌కు భారత జట్ల ప్రకటనతో పాటు ఇరానీ కప్ 2026 కోసం రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును కూడా ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా రిషబ్ పంత్‌ను ఎంపిక చేసింది. పంత్‌కు విండీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు ఎంపిక? చేసిన జట్లలో చోటు దక్కలేదు. రంజీ ట్రోఫీ 2025–26 విజేత జమ్మూ కశ్మీర్‌తో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు ఇరానీ కప్‌లో తలపడనుంది. ఈ వన్–ఆఫ్ మ్యాచ్ అక్టోబర్ 1 నుంచి 5 వరకు శ్రీనగర్‌లోని షేర్–ఎ–కశ్మీర్ స్టేడియంలో జరగనుంది.

**ఇరానీ కప్ కోసం రెస్ట్ ఆఫ్ ఇండియ జట్టు**

రిషబ్ పంత్ (కెప్టెన్ మరియు వికెట్ కీపర్), సనత్ సాంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫరాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరణ్ రవిచంద్రన్, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్, ఆకాశ్ దీప్ (ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి), ముఖేష్ కుమార్, ముకేష్ చౌదరి, ఆర్యన్ జుయల్ (వికెట్‌కీపర్), ఆర్యన్ పాండే, అనుకూల్ రాయ్, ఆయుష్ దోసెజా

# బాలీవుడ్‌లో శ్రీలీల.. కార్తీక్ ఆర్యన్‌తో ముగించేసినట్టేనా?

టాలీవుడ్‌లో అత్యంత వేగంగా స్టార్‌డమ్ అందుకని క్రేజీ హీరోయిన్‌గా మారిన శ్రీలీల.. ఇప్పుడు అదే స్థాయిలో బాలీవుడ్‌లోనూ తన పాపులారిటీని పెంచుకుంటోంది. ఉత్తరాది ప్రేక్షకులను ప్రత్యేకించి జెన్ జీ యూత్‌ను మెచ్చే గ్లోబల్ స్టార్‌గా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆరంభంలోనే అవకాశం దక్కించుకుని.. అక్కడ వరుస అవకాశాలు అందుకునేందుకు సిద్ధమవుతోంది.

బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ .. ప్రతిభావంతుడైన దర్శకుడు అనురాగ్ బసు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ లవ్ అండ్ మ్యూజికల్ ఎంటర్‌టైనర్ చిత్రం కోసం శ్రీలీల ఇటీవల తిరిగి ముంబైలో షూటింగ్ ప్రారంభించారు. పింక్‌విల్లా కథనం ప్రకారం.. శ్రీలీల తన సన్నివేశాల చిత్రీకరణను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి బిజీగా పాల్గొంటున్నారు. ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ తోనే ఈ బ్యూటీ హిందీ చిత్రసీమలో అధికారికంగా అడుగుపెడుతుండటం విశేషం.





అనుపమ పరమేశ్వరన్ పవర్-సూట్ ఎరా

ఇప్పటికే హీరో కార్తీక్ ఆర్యన్‌కు సంబంధించిన మెజారిటీ భాగం షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో ఈ చిత్రాన్ని ప్రఖ్యాత ఫ్రాంచైజీ అయిన –ఆషిఖీ–కి కొనసాగింపు భాగంగా మీడియాలో భావించినా... ఇది ఆ ఫ్రాంచైజీకి ఎలాంటి సంబంధం లేని ఒక ప్యూర్ ఒరిజినల్ లవ్ స్టోరీ అని చిత్ర బృందం స్పష్టం చేసింది. తాజా కథనాల ప్రకారం ఈ చిత్రానికి –తూ మేరీ జిందగీ హై– అనే టైటిల్‌ను ఖరారు చేసే ఆలోచనలో ఉన్నారు. ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ప్రీతమ్ స్వరాలు సమకూరుస్తుండగా... కథనంలో పాటలే అత్యంత కీలకమైన పాత్రను పోషించనున్నాయి.

ఇక ఈ సినిమా కథాంశం విషయానికొస్తే... ఇది –ఆషికి– ఫ్రాంచైజీ భావజాలానికి దూరంగా... ఆధునిక కాలానికి తగినట్టుగా తీర్చిదిద్దిన తీవ్రమైన భావోద్వేగాలు, ప్రేమ, విరహం కలబోసిన ఒక సరికొత్త రొమాంటిక్ డ్రామాగా ఉండబోతోంది. –ఆషిఖీ– సిరీస్‌లోని పాత మూస పద్ధతులను అనుసరించకుండా.. దర్శకుడు అనురాగ్ బసు తనదైన శైలిలో విజువల్ గ్రాండియారిటీ.. మ్యూజికల్ మ్యాజిక్ మేళవించి పూర్తిగా ఒక ఒరిజినల్ కథతో అందంగా రూపొందిస్తున్నారు. విడిపోయిన ఇద్దరు ప్రేమికుల మధ్య సాగే భావోద్వేగ ప్రయాణం .. మ్యూజిక్ బ్యాక్‌డ్రాప్ ఈ కథకు ప్రధాన బలమని సమాచారం.శ్రీలీల ప్రస్తుతం టాలీవుడ్‌లో పవన్ కల్యాణ్‌తో చేసిన –ఉస్తాద్ భగత్ సింగ్– చిత్రంతో పాటు –ఓమ్ చాప్టర్ 1: ఉధిరం – ది బ్లడ్ వుడ్– అనే విభిన్నమైన ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. మరోవైపు కార్తీక్ ఆర్యన్ లైనప్‌లో నాగ్‌జిల్లా, భూల్ భులయా 4 వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఎన్నో అంచనాలు నెలకొల్పిన కార్తీక్–శ్రీలీలల ఈ భారీ మ్యూజికల్ లవ్ స్టోరీ 2026 నాటికి థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.



యాషికా ఆనంద్ స్లైకింగ్ స్టూడియో పోర్ట్రెయిట్ లో గ్లామర్‌ను ప్రసరింపజేస్తుంది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com